

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 249 • పేజీలు : 8 • శనివారం 1 జూన్ 2024 • వెల : రూ. 5.00
Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati



## ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

◆ ఫలితాల కోసం భారీగా ఏర్పాట్లు ◆ ఆసక్తిగా ఎదురు చూస్తున్న జనాలు ◆ నరాలు తెగే ఉత్కంఠలో పోటీచేసిన నేతలు ◆ తొలుత కొవ్వూరు..తరువాత నరసాపురం ఫలితం

**అమరావతి, మే 31 (ఆంధ్రపత్రిక):** కౌంట్‌డౌన్ మొదలయ్యింది. 4న ఫలితాల లెక్కింపుపైనే ప్రజలంతా ఆసక్తిగా ఉన్నారు. రాజకీయా నాయకులు మాత్రం నరాలు తెగే ఉత్కంఠలో ఉన్నారు. యావత్తు దేశం ఏపీ ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తోంది. గతంలో ఎన్నడూ లేనంత ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఓట్ల లెక్కింపు జూన్ 4న మొదలుకానుంది. ఇప్పటికే ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఓట్లలెక్కింపు ఎలా సాగుతుంది. ఏయే ఫలితాలు ఎప్పుడొస్తాయన్నది ఆసక్తిగా మారింది. గతంలో ఎప్పుడూ లేనంతగా పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకే అనుకూలమని నిర్ణయించుకున్నారు. సిఎం జగన్ మరోమారు అధికారం చేపడతారని, 9న విశాఖలో ప్రమాణ స్వీకారం మిగతా 7లో

◆ ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు పోలింగ్
◆ వారణాసి నుంచి ప్రధాని మోడీ పోటీ
◆ హిమచల్ నుంచి నటి కంగనా రనౌత్
◆ లోక్‌సభ తుదిదశకు లోక్‌సభ ఎన్నికలు
◆ ఎన్నికల్లో బరిలో దాదాపు 904 మంది అభ్యర్థులు
◆ జూన్ 1న సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్ డేటాను ప్రదర్శించుకోవచ్చు..
◆ టెలివిజన్ ఛానల్స్, వార్తా సంస్థలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు
◆ ఇప్పటికే డేటాతో సిద్ధంగా ఉన్న పలు ఎగ్జిట్ పోల్స్‌ను సంస్థలు
◆ వారణాసి నుంచి మూడోసారి పోటీ చేస్తున్న మోదీ



## నేడు చివరిదశ ఎన్నికలు

**న్యూఢిల్లీ,మే31 :** లోక్‌సభ తుదిదశ ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. దాదాపు 904 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. వారణాసి నుంచి ఆయన మూడోసారి పోటీ చేస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లో 57 స్థానాలకు ఈ ఏడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి వారణాసి నుంచి పోటీ చేస్తున్నారు. పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలకు, మిగతా 7లో

## ఇంగ్లండ్ నుంచి బంగారం తరలింపు

- ప్రత్యేక విమానంలో వంద టన్నుల బంగారం రాక
- భారీ బందోబస్తు మధ్య తరలించిన ఆర్‌బిఐ



**ముంబయి,మే 31 :** ఇంగ్లాండ్ నుంచి భారీఎత్తున బంగారం నిల్వలను ఆర్‌బిఐ భారత్‌కు తరలించింది. దాదాపు 100 టన్నులు అంటే లక్ష కిలోల పసిడిని దేశీయ ఖజానాలో చేర్చింది. 1991 మిగతా 7లో

## ఢిల్లీలో నీటి సంక్షోభం..

◆ నీటిపై పడిన ఎండల ప్రభావం
◆ నీటి చుక్కను ఒడిసి పట్టుకోవడానికి నానాప్రయత్నాలు
◆ వాటర్ ట్యాంకులపై ఎగబడుతున్న జనం

7లో



## ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

- ఏప్రిల్‌లో పరారీ..మేలో ప్రత్యక్షం
- ప్రజ్వల్ రేవణ్ణను అరెస్ట్ చేసిన సిట్



**బెంగళూరు,మే 31 :** ఎట్టకేలకు మాజీ ప్రధాని దేవేగౌడ మనవడు, హాసన్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్ అయ్యారు. పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు గురువారం మిగతా 7లో

## సజ్జల వ్యాఖ్యలు దారుణం



◆ సజ్జల వ్యాఖ్యలపై టిడిపి సీరియస్
◆ 153, 505, 125 సెక్షన్ల కింద సజ్జలపై కేసు
◆ ఫిర్యాదు చేయడంతో పోలీసుల కేసు నమోదు

**అమరావతి,మే 31 (ఆంధ్రపత్రిక):** వైకాపా ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై క్రిమినల్ మిగతా 7లో

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలు ప్రకటించాలి



- గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించిన పురంధేశ్వరి
- సర్పంచ్‌లు, గుత్తేదారులకు బిల్లులు కూడా ఇవ్వలేదు..

**విజయవాడ,మే 31 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై వివరాలు ప్రకటించాలని కోరుతూ గవర్నర్‌కు బిజెపి నేతలు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పురంధేశ్వరితో పాటూ కాపు రామచంద్రారెడ్డి, సాధినేని యామిని శర్మ, మిగతా 7లో



## ధ్యానంతో ప్రజాధనం వృధా..?

◆ విశ్వాసం ఉంటే ఇంట్లోనే ధ్యానం చేయొచ్చు
◆ ఈ ఎన్నికల్లో ప్రజలు ఇండియా కూటమికే ఓటు
◆ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భరోసా

7లో




## శ్రీవారిని దర్శించుకున్న అమిత్ షా దంపతులు..

7లో






## వైసిపి గెలిచే అవకాశాలు లేవు..!

◆ సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు
◆ జయజయహే గీతం ఆమోదించడం హర్షణీయం
◆ కౌంటింగ్ గురించి కూడా వైసీపీ నేతలు రెచ్చగట్టే మాటలు
◆ రాష్ట్ర చిహ్నం జోలికి వెళ్లకుండా.. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టండి

**హైదరాబాద్, మే 31 (ఆంధ్రపత్రిక):** జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా రూపొందించడం అభినందనీయమని మిగతా 7లో

## ఎపి రాజధాని వ్యవహారం..!

◆ ఎన్నికల ఫలితాలతో..తేలనున్న రాజధాని
◆ ఎపి రాజధాని అమరావతా..విశాఖపట్టణమా..
◆ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే చలో విశాఖ..
◆ చంద్రబాబు అధికారంలోకి వస్తే చలో అమరావతి




**అమరావతి, మే 31 (ఆంధ్రపత్రిక):** ఎపి రాజధాని అమరావతా..విశాఖపట్టణమా..ఇప్పుడీ ప్రశ్న మళ్లీ మొదలయ్యింది. ఎన్నికల ఫలితాల తోనే దీనికి స్పష్టత రానుంది. జగన్ అధికారం చేపడితే చలో విశాఖ..చంద్రబాబు అయితేనే అమరావతి..ఇదీ మిగతా 7లో

## ఐదేళ్ల న్యాయ పోరాటం

◆ సీనియర్ ఐపిఎస్ ఎబివికి ఎట్టకేలకు పోస్టింగ్
◆ ఉదయం జాయినింగ్.. సాయంత్రం రిటైర్‌మెంట్
◆ ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ



**అమరావతి,మే 31 (ఆంధ్రపత్రిక):** ఎట్టకేలకు ఐదేళ్ల వేధింపుల తరవాత..సీనియర్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# అమ్మదనం-కమ్మదనం

అమ్మ ప్రేమను పొందడం అందరికీ తెలిసిన అనుభవమే.కానీ, అమ్మ ప్రేమను వర్ణించమంటే? అది సాధ్యమయ్యేపని కాదు.వ్యాసానికి, ఉపన్యాసానికి అందని సృష్టి అమ్మ. ఏ మహాకవియైనా ప్రేయసి అందాన్ని వర్ణించగలడు.పరిపాలించే రాజులోని వీరత్వాన్ని, దాన గుణాన్ని వచించగలడు. కనిపించని దైవాన్నికూడా కవితామయం చేసి స్తుతించగలడు. నవరసాలకు అక్షరాకృతి ఇవ్వగలడు.అమ్మని వర్ణించడానికి ఏ మహాకవి దగ్గర ఉన్న కవితా సంపద సరిపోదు.ఏ చిత్రకారుడి, ఏ శిల్పకారుడి కళాప్రతిభలు సరిజాలవు. అమ్మతనాన్ని తూకం వేసే రాళ్లు సృష్టిలో లేనేలేవు. ఆమెపట్ల కృతజ్ఞత,ఆమె పెంచిన, పంచిన జ్ఞాపకాల మధురత, ఆమె అందించిన సేవల, చిలికించిన ప్రేమల,పంచిఇచ్చిన సంస్కార సంపదల, త్యాగనిరతుల స్మృతిలో తరించడం, హృదయం పరచి కన్నీళ్లు, ఆనందభాష్పాలు ఏకంచేసి నిలువెత్తు కృతజ్ఞతతో నమస్సులు సమర్పించడమే మనం చేయగలిగింది.చేయవలసింది కూడా .కొండంత దేవునికి కొండంత పత్రి సమర్పించలేం కదా ! అని, పూజించడం మానం కదా.దొరికిన ఒక పువ్వుతోనైనా, ఒక పత్రంతోనైనా పూజలు చేస్తాం.అలాగే,అక్షరాలు దొరకలేదని అమ్మను అర్చించకుండా ఉంటామా? “న మాతుః పరం దైవతమ్” అన్నది ఆర్యోక్తి. తల్లిని మించిన దైవం లేదన్నది దాని సారాంశం.ఆదిశంకరాచార్యుడి నుంచి ఆధునిక సినిమా కవి వరకూ అమ్మను అక్షరాల్లో బొమ్మకట్టించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఒకప్పటి చందమామ పుస్తకంలో, అమ్మగురించి చెప్పిన ఒక కథ ఈ సందర్భంలో గుర్తు చేసుకుందాం. “ మీ తల్లి గుండె నాకు కావాలి.అది తీసుకొచ్చి ఇవ్వమని భార్య భర్తను కోరింది. భార్య వ్యామోహంలోఉన్న అతను తల్లి గుండెను కోసి, తీసుకొని వస్తూ ఉంటాడు. ఇంతలో,అతనికి ఒక రాయి తగులుతుంది ... అమ్మా ! అని అరుస్తాడు. ఏం నాయనా దెబ్బ తగిలిందా? నొప్పిగా ఉందా? జాగ్రత్తగా వెళ్ళు అంటుంది అమ్మ”. అదీ అమ్మతనం! తన గుండెను కోసి తీసికెళ్తున్నా, కొడుకు క్షేమం గురించే ఆలోచించేది అమ్మ. ఈ కథ చెప్పే నీతి అది. అందుకే, ఆదిశంకరాచార్యులు“కు పుత్రో జాయేత క్వచిదపి కు మాతా న భవతి “ అంటాడు. ఎక్కడైనా,ఎప్పుడైనా చెడ్డకుమారుడు ఉంటాడేమో! కానీ,చెడ్డతల్లి ఎక్కడా ఉండదు, అని దాని తాత్పర్యం.ఈ వాక్యం మనమందరం పటం కట్టించుకొని గుండెల్లో పెట్టుకోవాలి.తల్లి పట్ల మనం ఎంత మంచిగా ఉంటున్నాం, ఎంత చెడ్డగా ఉంటున్నాం, అని నిరంతరం మనల్ని మనం ఆత్మపరీక్ష చేసుకుంటూ ఉండాలి. అసలు మనలో చాలామంది తల్లి దండ్రులను ఇంట్లోనే ఉంచుకోవడం లేదు.వాళ్ళు రెక్కలు ముక్కలు చేసుకొని,డొక్కలు ఎండగట్టుకొని పిల్లలను పెంచుతారు.పిల్లలకు రెక్కలు రాగానే తల్లిని ఒదిలిపెట్టివెళ్లేవారు కొందరు, వృద్ధాశ్రమాల్లో చేరుస్తూ మరికొందరు,కొంతమంది సేవకులను అప్పజెప్పివేరే ఇళ్లల్లో ఉంచేవారు ఇంకొందరు ప్రబుద్ధులు తయారవుతున్న నవీన నాగరిక సమాజంలో నేడు మనమున్నాం.తల్లి పనికిరాని వస్తువయ్యింది.పిల్లలకు బరువయ్యింది.ఆ తల్లిని వదిలించుకొనే, దించుకొనే ప్రయత్నంలోనే నేటికాలపు పిల్లలు సాగుతున్నారు.అందుకే, “ఇంత ముద్ద తినక ఏడిపించెను నాడు - పెట్టబోక ఏడిపించు నేడు” అన్నారు గరికిపాటి నరసింహారావు ఒక పద్యంలో. చిన్నప్పుడు అన్నం తినకుండా మారాం చేస్తున్న పిల్లవాడిని, వెంటపడి అన్నం పెడుతుంది, అయ్యో! వీడు అన్నం తినడం లేదే? అని బాధపడుతుంది అమ్మ. వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత, ఆ అమ్మకే అన్నం పెట్టకుండా, ఏడిపిస్తాడు అదే కొడుకు. చిన్నప్పుడూ, పెరిగి పెద్దయినప్పుడూ అమ్మకు కన్నీళ్లే మిగిలిస్తున్నాం. అత్తా ఒకప్పుడు కోడలే అన్న చందంగా,కూతురు లేదా కోడలు జీవితంలో ఏదో ఒకనాడు తల్లిపాత్ర పోషించాల్సిందే.తన పిల్లలకు తల్లితనం పంచాల్సిందే. పంచుతుంది కూడా. కానీ! ఈ క్రమంలో,అత్తగారిలోని తల్లి ఈమెకు గుర్తురాదు. అదే మాయ!భార్య మాయలోనో,భయంతోనో, అవసరంతోనో తల్లిని కొడుకు మరచిపోతున్నాడు.అదీ నేటి విషాదం.ప్రతి సంవత్సరం మే నెలలో వచ్చే రెండవ ఆదివారంనాడు ప్రపంచవ్యాప్తంగా మాతృదేవతా దినోత్సవం జరుపుకోవడం కొన్నేళ్లుగా వస్తున్న ఆనవాయితీ.అది ఎవరు మొదలు పెట్టారు,ఎందుకు మొదలు పెట్టారు, ఎప్పుడు మొదలు పెట్టారు అనే చరిత్ర, తారీఖులు,దస్తావేజులు గురించి పెద్దగా చర్చ చేయాల్సిన అవసరం లేదు.వారు మొదలు పెట్టిన సంప్రదాయాన్ని మనం కూడా గౌరవిద్దాం.అమ్మను తలచుకుందాం. అమ్మను కొలుచుకుందాం. “అమృతానికి, అర్పణకు అసలుపేరు అమ్మ – ఈ లోకమనే గుడి చేరగ, తొలివాకిలి అమ్మ “ అన్నారు మాడుగుల నాగఫణిశర్మ. అమృతం ఎలా ఉంటుందో, మనకెవ్వరికీ తెలీదు. అది అనిర్వచనీయం. త్యాగం,ప్రేమ,సేవల అర్పణకు అసలు పేరు అమ్మ .ఆ తల్లి ఋణం మనం తీర్చుకోలేం.అంత ప్రేమ మనం తిరిగి ఆమెకు పంచలేం. మరణించినప్పుడు తద్దినాలు (పితృకార్యాలు)పెట్టడం ,పెద్ద పెద్ద ఉత్సవాలు చెయ్యడం మాత్రమే కాదు.తల్లి బతికున్నప్పుడు ఆమెను ఎంత గౌరవించాం,ఎంత ప్రేమించాం, ఎంత సేవించాం అన్నది, అన్నింటికన్నా ముఖ్యం. కొడుకు,కోడలు,కూతురు అందరూ అమ్మతనం పట్ల స్పృహగా ఉండాలి. గౌరవంగా మెలగాలి. కొన్ని రాష్ట్రాల్లో సంతానానికి తల్లిపేరు కూడా కలిపి పెడతారు. ఈ మధ్య కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యక్తి నుంచి సమాచారం సేకరించే క్రమంలో తండ్రిపేరుతో పాటు తల్లి పేరు కూడా చేర్చారు. వీలైనంతవరకూ తల్లిదండ్రులను మనతోనే ఉంచుకుందాం. పిల్లల పట్ల ఎంత ప్రేమ,శ్రద్ధ చూపిస్తామో? తల్లిదండ్రుల పట్లా అంతే ప్రేమ చూపిద్దాం. సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే తలచుకొనే పండగ కాదు అమ్మ.., ప్రతినిత్యం గుండెల్లో కొలవాల్సిన బొమ్మ... అమ్మ. మహాభారతంలోని యక్షప్రశ్నల్లో యమధర్మరాజు వేసిన ప్రశ్నలకు ధర్మరాజు చెప్పిన సమాధానాలు చూద్దాం: ఆకాశం కంటే ఎత్తైనవాడు? = తండ్రి,భూమి కంటే గొప్పది? = తల్లి. క్షమయా ధరిత్రి,అన్నది ఆర్యోక్తి.సహనానికి మారుపేరు భూమి,అన్నది దాని తాత్పర్యం. ఆ భూమి కంటే కూడా మించిన సహనం కల్గింది అమ్మ.అందుకే, భూమికంటే కూడా గొప్పది అమ్మ. అదీ ధర్మరాజు చెప్పిన సమాధానం . ఇంత గొప్పతనం మూర్తీభవించిన అమ్మకు వందనం సమర్పిద్దాం. అమ్మతనానికి జేజేలు పలుకుదాం.

## సుప్రీంకోర్టు న్యాయవాది, హైకోర్టు శాసనసభ్యులు

# గోపాలరావు ఎక్బోటే..



న్యాయవాదిగా కొనసాగారు. శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. రాష్ట్రమంత్రిగా పనిచేశారు. రాజకీయాల నుంచి వైదొలగారు. ప్రజాసేవలో మమేకమయ్యారు. న్యాయమూర్తిగా నియమితులయ్యారు గోపాలరావు ఎక్బోటే.గోపాలరావు ఎక్బోటే 1912 జూన్ 1న జన్మించారు. వీరి పూర్వీకులది హైదరాబద్. వీరి తండ్రి మహారాష్ట్రలోని ఔరంగాబాదులో ఉద్యోగం చేస్తుండేవారు. ఎక్బోటే బాల్యమంతా అక్కడే గడచింది. విద్యాభ్యాసం కూడా అక్కడే మొదలైంది. ఔరంగాబాదులోని ‘సరస్వతి భువన్’ మిడిల్ స్కూలులో ప్రాథమిక విద్య పూర్తి చేసి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైస్కూలు విద్య పూర్తి చేశారు. అటు తర్వాత హైదరాబాదుకు చేరి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. కొద్ది రోజులు మాత్రమే హైదరాబాదులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. అనంతరం ఔరంగాబాదు వెళ్లి అక్కడి జిల్లా కోర్టులో ప్రాక్టీసు మొదలు పెట్టారు. 1948 నాటికి హైదరాబాదు వచ్చి, నవంబరు 28న హైకోర్టులో పేరు నమోదు చేయించుకొని, న్యాయవాది వృత్తి చేపట్టారు. కొద్ది రోజుల్లోనే మంచి గుర్తింపు పొందారు. ఎక్బోటే సివిల్ కేసులు మాత్రమే వాదించేవారు.అప్పటికి హైదరాబాదులో న్యాయవాదులుగా కొనసాగుతున్న వారికి వీరు ముందుకు దూసుకుపోవడం గిట్టలేదు. ఎక్బోటేని న్యాయవాది వృత్తి నుంచి తప్పించాలని ఆలోచన చేశారు. అందుకు కొందరు రాజకీయ నాయకులను పురమాయించారు. వారు ఎక్బోటేని రాజకీయాల్లోకి ఆహ్వానించారు. ఆ విధంగా ఎక్బోటే రాజకీయరంగ ప్రవేశం చేయటం జరిగింది. హైదరాబాదు జిల్లాలోని పత్తర్ ఘాట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థిగా ఎక్బోటే పోటీ చేసి బన్సర్ లాల్ అనే సోషలిస్టు అభ్యర్థిని 8,651 ఓట్ల తేడాతో ఓడించారు. (1952 తర్వాత పత్తర్ ఘాట్ నియోజకవర్గం రద్దయింది) అప్పటికి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడలేదు. తెలంగాణ జిల్లాలు హైదరాబాదు రాష్ట్రంగానే కొనసాగుతుండేవి. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగారు. హైదరాబాదు రాష్ట్ర శాసనసభ మొట్టమొదటి సమావేశం 1952 మార్చి 21న జరిగింది. ఎక్బోటే రాష్ట్రమంత్రిగా నియమితులయ్యారు. స్థానిక పాలన, విద్య, శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆనాటి మంత్రివర్గంలో ఎక్బోటే క్యాబినెట్ హోదా గల మంత్రి కూడా. భాషాప్రయుక్త రాష్ట్రం కావాలంటూ నాయకులు ఉద్యమం ప్రారంభించారు. ఉద్యమం ఊపందుకోవటంతో ఫజల్ అలీ కమీషన్ ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. హైదరాబాదు రాష్ట్రంలోని ఎక్కువ మంది శాసనసభ సభ్యులు భాషాప్రయుక్త రాష్ట్రం అవసరమనే అభిప్రాయం వెలిబుచ్చారు. బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలోని వినాయకరావు విద్యాలంకార్, మెహిదీ నవాబ్ జంగ్ లాంటి వారు భాషాప్రయుక్త రాష్ట్ర ఉద్యమానికి వ్యతిరేకంగా వ్యవహరించారు. హైదరాబాదు నగరం అప్పటి నిజాం పాలకుల పాలనలో అవస్థలు పడుతోంది. ఏ విధమైన అభివృద్ధి జరగాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ మంది అభిప్రాయం ప్రకారం ‘ఆంధ్రప్రదేశ్’ పేరున 1956లో భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడింది. ఆ తర్వాత హైదరాబాదు రాష్ట్రాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేశారు. భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు విషయంలో ఎక్బోటే నిరంతరం కృషి సల్పారు. 1957లో తెలంగాణ జిల్లాలకు ఎన్నికలు జరిగాయి. పత్తర్ ఘాట్ నియోజకవర్గం రద్దు కావటంతో ఎక్బోటే 1957లో హైదరాబాదు జిల్లాలోని హైకోర్టు శాసనసభా స్థానం నుంచి కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థి యన్.యం. జయసూర్యను 8,092 ఓట్ల తేడాతో ఓడించారు. (1957 తర్వాత హైకోర్టు నియోజకవర్గం కూడా రద్దయింది) తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనమయ్యాక డా.. నీలం సంజీవరెడ్డి రెండవసారి ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. ఆ మంత్రివర్గంలో ఎక్బోటేకి స్థానం దక్కుతుందని చాలామంది అభిప్రాయపడ్డారు. భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు విషయంలో వ్యతిరేకించిన తెలంగాణ కాంగ్రెసు నాయకులు ఎక్బోటేకి అడ్డు తగిలారు. ఆ అవకాశం చేజారి, తెలంగాణకు చెందిన మెహిదీ నవాబ్ జంగ్ కి దక్కింది. అయినా ఎక్బోటే చింతించలేదు. ప్రజాసేవకు పదవే పరమావధి కాదన్నది వారి నిశ్చితాభిప్రాయం. అయినా ఎస్టిమేట్స్ కమిటీ అధ్యక్షునిగా నియమించింది ప్రభుత్వం. ఆ పదవిలో కొనసాగుతున్న కాలంలో ప్రభుత్వ నిధులు దుబారా కాకుండా అడ్డు కట్టవేశారు. అప్పటికి జరిగిన ఎన్నో దుబారాలను వెలుగులోకి కూడా తెచ్చారు. ఇలాంటివి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నీలం సంజీవరెడ్డిని ఇరకాటంలో పెట్టాయి. చూసీచూడనట్లు పొమ్మని సంజీవరెడ్డి సూచనలు కూడా ఇచ్చారు. తన ముక్కుసూటితనం విడనాడలేదు ఎక్బోటే. అయినా ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి ప్రముఖులతో సన్నితంగా మెలిగేవారు. అయినా రాష్ట్రంలోని నాయకులు మాత్రం వీరిని దూరంగా నెట్టే ప్రయత్నంలోనే ఉంచటం కూడా ఎక్బోటే గమనించారు. క్రమక్రమంగా రాజకీయాలకు దూరమై న్యాయవాదిగా కొనసాగటం మొదలెట్టారు.న్యాయ వ్యవస్థలో ఏదో ఒక పదవి ఎక్బోటేకి కట్టబెటితే రాజకీయాలకు దూరంగా తొలగుతారని కాంగ్రెసు నాయకులు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి పదవికి ఖాళీ ఏర్పడటం, దానికి ఎక్బోటే పేరు సూచించటం కూడా జరిగింది. అలా 1962 జూన్ 7న ఎక్బోటే ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులై రాజకీయాలకు దూరమయ్యారు. రెండేళ్ళు గడవక ముందే 1964 ఫిబ్రవరి 12న శాశ్వత న్యాయమూర్తిగా ఉత్తర్వులందు కున్నారు. న్యాయమూర్తిగా కొనసాగుతూ న్యాయ వ్యవస్థను ముందుకు తీసుకు వెళ్ళటానికి అహర్నిశలూ శ్రమించారు. మరో అపూర్వ అవకాశం వారికి అంది వచ్చింది. 1972 ఏప్రిల్ 1న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితు లయ్యారు. ఒక చెడు మరో మంచికి వారధి అంటారు. మేధావులు రాజకీయాల నుంచి నాయకులు చేసిన ప్రయత్నం వారిని ఏకంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూర్చోబెట్టింది. 1974 జూన్ 1 వరకూ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. అటు తర్వాత పౌర గ్రంథాలయాలు ఏర్పా టుకై అమితంగా శ్రమించారు. పౌర గ్రంథాలయాల అభివృద్ధికై 1977లో ఒక నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందిం చారు. అది ఆమోదం పొందలేదు. “ఎడ్యుకేషన్ సిస్టం ఇన్ ఇండి యా అండ్ లీగల్ ఎడ్యుకేషన్”, “ఏ నేషన్ వితౌట్ ఏ నేషన్ లాం గ్వేజ్”, “పబ్లిక్ లైబ్రరీస్ సిస్టం” అనే గ్రంథాలు కూడా రాసిన ఎ క్బోటే 1994 జూన్ 4న మరణించారు.

దాసరి ఆళ్వారస్వామి

# విలక్షణ రాజకీయ నాయకుడు నీలం సంజీవరెడ్డి



నీలం సంజీవరెడ్డి విలక్షణ నాయకులు. భారత దివంగత రాష్ట్రపతి సంజీవరెడ్డి రాజకీయ జీవితం అనేక ఒడిదుడుకులతో కూడుకున్నది. విజయాలు, అపజయాలు, త్యాగాలు, సాహసోపేత నిర్ణయాలు, రాజకీయపు ఎత్తుగడలతో కూడిన రాజకీయ జీవితం ఆయనది. 1940 ల నుండి 1970ల వరకు మూడు దశాబ్దాల రాష్ట్ర, దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ప్రతి ముఖ్య సంఘటనతోను ఆయనకు ప్రత్యేక, ప్రత్యక్ష, సంబంధాలు, ప్రమేయాలు ఉన్నాయి. భారత రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అరుదైన రికార్డు రాష్ట్రపతి సంజీవరెడ్డికే దక్కింది. లోకసభాపతిగా ఎన్నిక కాగానే, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన మొదటి లోక్‌సభ సభాపతి, సంజీవరెడ్డి కావడం విశేషం. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి అధికారపక్ష - ప్రతిపక్షం మధ్య సమన్వయ సాధనకు కృషి చేసి, స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన ఆదర్శ నేత నీలం.లోక్‌సభ సభాపతిగా రెండు సార్లు ఎన్నికై, రెండుసార్లూ రాష్ట్రపతిగా పోటీ చేసేందుకై రాజీనామా చేసిన చరిత్ర ఆయనకు ఉంది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు, ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు, ఆ తరువాతి రాజకీయ చరిత్రలతో సంజీవరెడ్డి పాత్ర విస్మరించ రానిది. నీలం సంజీవరెడ్డి (మే 19, 1913 – జూన్ 1, 1996) భారత రాష్ట్రపతి గా, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, అఖిల భారత కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి, ప్రజల మన్ననలను పొందిన సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి సంజీవ రెడ్డి. అనంతపురం జిల్లా, ఇల్లూరు గ్రామంలో 1913, మే 18 న రైతుబిడ్డగా సంజీవరెడ్డి జన్మించారు. మద్రాసు దివ్యజ్ఞాన సమాజం పాఠశాలలోను, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను చదువుకున్నారు. 1929 లోనే మహాత్మా గాంధీ స్ఫూర్తితో చదువును పక్కనపెట్టి రాజకీయాల్లో చేరి స్వాతంత్ర్య పోరాటం వైపు దృష్టి సారించారు. 1937లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీకి కార్యదర్శిగా ఎన్నికై దాదాపు పదేళ్ళపాటు ఆ పదవిలో కొనసాగారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు.1940, 1945 ల మధ్య ఎక్కువకాలం అతను జైలులో ఉన్నారు. 1946లో మద్రాసు శాసనసభకు, తర్వాత 1947లో రాజ్యాంగ నిర్మాణ సంఘమైన రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. 1949 నుండి 1951 వరకు మద్రాసు రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసారు. 1951 లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు మంత్రిపదవికి రాజీనామా చేసారు. 1951లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఎన్.జి.రంగాతో పోటీ పడ్డారు. ప్రకాశం పంతులు మద్దతు ఉన్నా, రంగాను ఆ ఎన్నికలలో ఓడించారు. ఫలితంగా ఆచార్య రంగా, ప్రకాశం కాంగ్రెసును వదిలి వెళ్ళారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు సంయుక్త మద్రాసు రాష్ట్ర శాసనసభ సభ్యుల నుండి కొత్త రాష్ట్ర కాంగ్రెసు శాసనసభా పక్ష నాయకుణ్ణి ఎన్నుకునే సమయంలో సంజీవరెడ్డి పోటీలేకుండా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి పదవి తథ్యమైనా, అప్పటి రాజకీయాల ఫలితంగా తాను తప్పుకుని టంగుటూరి ప్రకాశం పంతులుకు నాయకత్వం అప్పగించి, ఉప ముఖ్యమంత్రి అయ్యారు. మళ్ళీ 1955లో రాజకీయాల ఫలితంగానే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని వదులుకున్నారు. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి ఎన్.జి.రంగా నాయకత్వం లోని కృషికార్ లోక్ పార్టీ మద్దతు కాంగ్రెసుకు అవసరమైంది. అయితే బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయితేనే తాము మద్దతు ఇస్తామని రంగా ప్రకటించడంతో తాను తప్పుకుని మళ్ళీ ఉప ముఖ్యమంత్రి అయ్యారు.ఆంధ్ర ప్రదేశ్ అవతరణలో సంజీవరెడ్డిది ప్రముఖ పాత్ర. రాష్ట్ర స్థాపనలో ప్రధాన, నిర్ణాయక ఘట్టమైన పెద్దమనుషుల ఒప్పందంలో ఆంధ్ర తరపున అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి, బెజవాడ గోపాలరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి కూడా పాల్గొని ఒప్పందంపై సంతకం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరించాక, కాంగ్రెసు శాసనసభాపక్ష నాయకుడిగా బెజవాడ గోపాలరెడ్డిని ఓడించి, తాను ముఖ్యమంత్రి అయ్యారు. అల్లూరి సత్యనారాయణ రాజును రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవి పోటికి నిలబెట్టి, రంగాను ఓడించారు. 1960లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవికి తాను ఎన్నికవడంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. అలా కాంగ్రెసు అధ్యక్షుడిగా రెండేళ్ళు పనిచేసి, మళ్ళీ 1962లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. రవాణా సంస్థల జాతీయాకరణ వివాదంలో సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టడంతో 1964 ఫిబ్రవరి 29 న పదవికి రాజీనామా చేసారు. తర్వాత కేంద్ర రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించారు.1964 జూన్ 9 న లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1967లో ఇందిరా గాంధీ ప్రభుత్వంలో కూడా కొద్దికాలం మంత్రిగా చేసారు. 1967లో నాలుగవ లోక్‌సభకు హిందూపురం నియోజక వర్గం నుండి ఎన్నికై, లోక్‌సభకు సభాపతిగా కూడా ఎన్నికయ్యారు. సభాపతి నిష్పాక్షికంగా ఉండాలనే ఉద్దేశంతో ఎన్నిక కాగానే, కాంగ్రెసు సభ్యత్వానికి రాజీనామా చేసాడు. కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు 1969 జూలై 10న బెంగళూరులో సమావేశం అయి, పార్టీ అధ్యక్షుడు నిజలింగప్ప, ప్రధాని ఇందిర సహా పార్టీలోని పెద్దలు కె. కామరాజ్, మొరార్జీ దేశాయి తదితరుల చర్చల అనంతరం 1969 జూలై 19 న సభాపతి పదవికి రాజీనామా చేసి, రాష్ట్రపతి పదవికి ఇందిరా గాంధీకి ఇష్టం లేకున్నా, కాంగ్రెస్ సీనియర్ నేతల నిర్ణయం మేరకు, ఇందిర నామినేషన్ దాఖలు లు వెంట రాగా, పోటీ చేసారు. “అంతరాత్మ ప్రబోధం” అనే ఇందిర నినాదంతో, కాంగ్రెసు అంతర్గత రాజకీయాల ఫలితంగా మరో తెలుగు వారు – వి.వి.గిరి – చేతిలో కొద్ది తేడాతో ఓడి పోయారు. 1969 ఆగస్టులో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తంగా 8,36,337 ఓట్లు నమోదు కాగా, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన వి.వి. గిరికి 4,20,077 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డికి 4,05,427 ఓట్లు వచ్చాయి. రెండో ప్రాధాన్యత ఓట్లతో వి.వి. గిరి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. తర్వాత పరిణామాలతో 1969 చివర్లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోయింది.1975 లో జయప్రకాశ్ నారాయణ్ హైదరాబాదులో జరిపిన పర్యటనతో రాజకీయాల్లో తిరిగి క్రియాశీల రాజకీయాల్లో పాలు పంచుకున్నారు. 1977లో ఎమర్జెన్సీ తరువాత, జనతాపార్టీ ప్రభంజనం... కాంగ్రెసును అధికారం నుండి దూరం చేసినపుడు, తెలుగు ప్రజలు మాత్రం కాంగ్రెసు వైపే ఉన్నారు, పట్టం కట్టారు. 42 స్థానాలకుగాను, 41ని కాంగ్రెసు గెలుచుకుంది. జనతాపార్టీ గెలిచిన ఒక్క స్థానమూ మాత్రం సంజీవరెడ్డిదే కావడం గమనార్హం. అలా మళ్ళీ లోక్‌సభ సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1977లో రాష్ట్రపతిగా ఉన్న ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ మరణించడంతో నీలం సంజీవరెడ్డిని ఎన్నుకునేందుకు నాటి జనతా పార్టీ నిర్ణయం తీసుకాగా, విపక్షంలో ఉన్న ఇందిరా గాంధీ కూడా సంజీవ రెడ్డికి మద్దతివ్వడంతో సంజీవరెడ్డి ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు.1982 లో రాష్ట్రపతి పదవి నిర్వహణ పూర్తయ్యాక, రాజకీయాల నుండి శాశ్వతంగా దూరమై, బెంగుళూరులో స్థిరపడగా ,1996 జూన్ 1 న నీలం సంజీవరెడ్డి మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# చిరంజీవి హన్మంతుడు



అశ్వథామ బలిర్వ్యాస : హనుమాన్ శ్చ విభీషణః కృప : పరశురామశ్చ సప్తేతే చిరజీవినః మార్కండేయస్తు అష్టమః ప్రోక్త :అశ్వత్థామ, బలి చక్రవర్తి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు, మార్కండేయుడు తదితరులను చిరంజీవులుగా భావిస్తారు. ఒక కల్పం... నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని జయంతి ప్రత్యేకత కలిగి ఉంది. భారతావనిలో వివిధ ప్రాంతాలలో హన్మాన్ జయంతిని వివిధ మాసాలలో జరుపు కుంటారు. ఆంజనేయుడు, హనుమంతుడు, హనుమాన్, బజరంగబలి, మారుతి, అంజనిసుతుడు వంటి ఎన్నో పేర్లతో హనుమంతుని ఆరాధిస్తారు. ఉత్తర భారత దేశంలో వారణాసిలో సంకట మోచన దేవాలయం, అయోధ్యలో హన్మాన్ గార్హి దేవాలయాలలో ఈ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో “మార్గళి” మాసం అనగా డిసెంబర్ లేదా జనవరిలలో జరుపు కుంటారు. ఒరియా క్యాలెండర్ ప్రకారం విషుభ సంక్రాంతి మొదటి రోజున వైశాఖంలో పాటించే ఆచారం ఉంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో వైశాఖ కృష్ణపక్ష మందు పెద్ద హన్మాన్ జయంతిగా జరుపుకునే సాంప్రదాయం ఉంది. చైత్ర పౌర్ణమి (చిన్న హన్మాన్ జయంతి)తో ప్రారంభించి, హన్మాన్ దీక్షలను వైశాఖ కృష్ణ పక్ష దశమి (పెద్ద హన్మాన్ జయంతి)కి ముగిసేలా 41రోజుల మండల దీక్షలను చేపట్టడం ఆన వాయితీగా, సాంప్రదాయ సిద్దంగా వస్తున్నది. ప్రధానంగా రామాయణంలో హనుమంతుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని ఆరు కాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి, అణిమాద్యష్టసిద్ధులు లభ్య మవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాల మీద ఆధిపత్యం ఉందో హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు. పంచభూతాలను వశం చేసుకున్న పరమాత్ముడు ఆయన.. జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచుకోగలిగిన మహాశక్తిశాలి. అందుకే గ్రహ పీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు, పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదువడం చిరకాలంగా అనుసరిస్తున్న సంప్రదాయం. శివాజీ గురువైన సమర్ధ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదాపాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్ణుడై హనుమంతుడు మహా భారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాధ అందరికీ తెలిసిందే. హనుమంతుడికి స్వర్గప్రాప్తి లభించినా, పవనసుతుడు అందుకు అంగీకరించక, తాను భూమిపైనే రాముడి భక్తుడిగా కలకాలం ఉండిపోతానని కోరుకుంటాడు. అందుకు శ్రీ రాముడు కూడా ఒప్పుకుంటాడు. ఈ కారణంగానే భూమిపై రాముడిని ఇప్పటికీ భజనలు, కీర్తనలతో కొలుస్తున్నారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఆంజనేయుడు, అవతార పురుషుడు అయిన శ్రీ రాముడినే తన హృదయంలో బంధించి భక్తిలో ఎవరికీ సాటి లేదని చాటాడు.

### బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి క్రిమినల్ కేసుల్లో పాల్గొంటే

# చట్ట ప్రకారం చర్యలు..!

## జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ



**మచిలీపట్నం మే 31 (ఆంధ్రపత్రిక) ;** శాంతి భద్రతలకు, ప్రజాశాంతికి విఘాతం కలిగించేలా అల్లర్లు, గొడవలను ప్రేరేపితం చేసి అశాంతిని సృష్టిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు. జిల్లావ్యాప్తంగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బైండోవర్ నిబంధనలు ఉల్లంగించిన10 మంది వ్యక్తులపై లక్ష రూపాయలు ,50 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించిన సంబంధిత మండల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లు. ఎన్నికల్లో ప్రజా శాంతికి విఘాతం కలిగించే ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్ లు, గత ఎన్నికల్లో నేరాలకు పాలు పడిన వారు, శారీరక/భౌతికంగా దాడి చేసిన వారిని,నేర చరిత్ర కల్గిన వారిని మరియు సమస్యల సృష్టించే వ్యక్తులపై జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ అధికారులు అటువంటి వారిని గుర్తించి వారిపై క్రమశిక్షణ కొరకే స్థానిక మండల తహసిల్దార్ల ముందు ఉంచగా 6 నెలలపాటు మంచి ప్రవర్తన కొరకై 1 ,00,000, 50,000 రూపాయల కొరకు పూచికత్తు బాండ్లతో బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగినది. అయినప్పటికీ వారి యొక్క ప్రవర్తన మారకపోగా మరల అదే తరహా నేరాలు చేసి క్రిమినల్ కేసులలో పాల్గొనడంతో వారిని ఎస్పీ ఆదేశాల మేరకు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను సంబంధిత వ్యక్తులను వారి యొక్క స్థానిక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లు ముందు ప్రవేశపెట్టగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వులు మేరకు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లునేరం చేసిన వారిపై విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన వారికి లక్ష రూపాయలు/ 50 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. జరిమానా విధించిన వివరాలు తెలిపారు. బందరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై 50,000 రూపాయలు,తోట్ల వల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై 50000 రూపాయలు,పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులలో ఒక్కొక్కరిపై 1,00,000/-(లక్ష) రూపాయలు ,కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులపై, ఒక్కొక్కరికి 50,000/- రూపాయలు ఉయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి పై 1,00, 000/-(లక్ష )రూపాయలు, నాగాయలంక పోలీస్ స్టేషన్లో ఒక వ్యక్తి పై జూన్ 4, 5 వ తేదీల్లో ఎలెక్షన్ కౌంటింగ్ నిమిత్తం పోలీస్ కస్టడీకై విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. మచిలీపట్నం పోలీస్ స్టేషన్ లో ఒక వ్యక్తిపై 50,000/-రూపాయలు జరిమానాలు విధించారు. పై వ్యక్తులు 5 నుంచి 7 రోజులు వ్యవధిలో జరిమానాను తహసిల్దార్ కార్యాలయాల్లో చెల్లించవలెనన్నారు. పై విధంగా ఎవరైనా వ్యక్తులు పోలీస్ స్టేషన్ పరిధిలో మంచి ప్రవర్తన కొరకై బైండ్ ఓవర్ అయ్యి తిరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే, అల్లర్లు సృష్టిస్తే, గొడవలకు దిగి బైండోవర్ నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అల్లర్లకు పాల్పడే వారి విషయంలో ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ హెచ్చరికలు జారీ చేశారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో

# ఇద్దరికి జైలు శిక్ష



**మచిలీపట్నం 31 మే (ఆంధ్రపత్రిక) :** మద్యం తాగి వాహనం నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి వస్తుందని ఇనుగుదురుపేట సీఐ సీహెచ్ విద్యాసాగర్ హెచ్చరించారు. గురువారం రాత్రి మచిలీపట్నంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో ఇద్దరు వ్యక్తులకు వారం రోజులు జైలు శిక్ష విధించడం జరిగిందన్నారు..

### గుడివాడలో జూన్ 1న

## హనుమత్ జయంతి శోభాయాత్ర

### బైక్ ర్యాలీ



**గుడివాడ 31మే (ఆంధ్రపత్రిక) :** గుడివాడ హిందూ చైతన్య వేదిక మరియు ఆజాద్ హిందూ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో జూన్ నెల ఒకటో తేదీన గుడివాడ పట్టణ పురవీధుల్లో హనుమత్ జయంతి శోభాయాత్ర....భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలియచేశారు. కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన శోభాయాత్ర కమిటీ సమావేశంలో పలు ధార్మిక సంస్థలు మరియు ఆధ్యాత్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఒకటవ తేదీ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు వాసవి చౌక్ వద్దగల శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్దనుండి శోభాయాత్ర ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు తెలియజే. ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం.... నాగవరప్పాడులోని శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం... ఏలూరు రోడ్డు... మార్కెట్ సెంటర్ మీదుగా పెద్ద శివాలయం వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం వరకు శోభాయాత్ర జరుగుతుందని కమిటీ సభ్యులు తెలియచేశారు. సందడి వాతావరణం లో జరిగే శోభాయాత్రలో కుల మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొనాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం లో కురాళ్ళ శ్యాంసుందర్, పూనూరు చంద్రశేఖర రెడ్డి,ముదెడ్ల శ్రీధర్, ఎక్కలి మాణిదీప్, జగత్,సానా వాసు,రవి,గుర్రం మురళీ, శ్రీనివాస్, వేమూరి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

### సీఐ షేక్ అబ్దుల్ నబీ



**తిరువూరు మే 31 (ఆంధ్రపత్రిక) ;** తిరువూరు పట్టణ స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమా వేశం నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ అబ్దుల్ నబీ. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మే 13 వ తారీకు జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భం గా అల్లరి మూకలు చేసిన గొడవలు కారణంగా రాష్ట్రంలో 1200 మందిని అరెస్టు చేసి జైలుకు పంపించడం జరిగిందనని ఈ సందర్భంగా గుర్తు చేశారు జూన్ నాలుగో తారీఖు జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడ అల్లర్లు జరక్కుండా ఉండాలి అలాకాకుండా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని ఎవరైనా అల్లర్లకు పాల్పడితే తప్పనిసరిగా అరెస్టు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. అన్ని పార్టీల నాయకులు ఇలా కలిసి వచ్చినందుకు చాలాసంతోషంగా ఉంది ముఖ్యంగా కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఏదో ఒక పార్టీ విజయం సాధిస్తుంది.గెలిచిన పార్టీ వారు ఓడిన పార్టీ వారిని చూసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని పేర్కొన్నారు అలా చేయకుండా మీ పార్టీ కార్యకర్తలను మీరే నివారించాలి ఎన్నికల నిబంధన ప్రకారం గెలిచిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు సంబరాలు చేయటానికి ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేవన్నారు. తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నియమించిన నిబంధన ప్రకారం ప్రతి రాజకీయ పార్టీ నాయకులు నడుచుకోవాలి అలా కాదని ఎవరైనా తిరస్కరించి వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ షేక్ అబ్దుల్ నబి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

### ఏలూరు జిల్లా యాదవ సంఘ

## ఉపాధ్యక్షుడిగా పుసునూరు



**ఆగిరిపల్లి, మే 31 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లి మండలం కలటూరు గ్రామ నివాసి పుసునూరు శ్రీనివాస రావు ఏలూరు జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎంన్నిక య్యారని ఇది చాలా సంతోషకర మైన విషయమని గ్రామ సర్పంచి రాఘవరపు సురేష్ కుమార్ తెలి పారు. ఉపాధ్యక్షుడిగా నియమితులైన పుసునూరు శ్రీనివాస రావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా శ్రీధర బోయిన శ్రీనివాసరావు తనను జిల్లా యాదవ సంఘానికి ఉపాధ్యాయుడుగా నిర్మించారని, తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, సంఘ నియమాలకు కట్టుబడి ఉండి ఆగిరిపల్లి మండలం లోని యాదవు లకు పార్టీలకతీతంగా సేవ చేస్తానని, మండలంలోని యాదవుల సమస్యలపై పోరాడుతానని, రాబోయే ఓట్ల లెక్కింపులో ఏ ప్రభుత్వం వచ్చినా వారితో సఖ్యతగా ఉండి మండలం లోని యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలుపుతూ తనను యాదవ సంఘానికి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడానికి సహకరించిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థి సమస్యల పరిష్కార వేదికగా పీఎస్ఎఫ్ఐ



**నూజివీడు మే 31 (ఆంధ్రపత్రిక) :** విద్యార్థుల సమస్యల శాశ్వత పరిష్కార వేదికగా ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పి ఎస్ ఎఫ్ ఐ) నిలుస్తుందని పి ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుబ్బాకు శివకుమార్ అన్నారు. నూజివీడు పట్టణంలోని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో పిఎస్ఎఫ్ఐ ఆరవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పిఎస్ఎఫ్ఐ పథకాన్ని ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడుతున్నట్లు తెలిపారు. స్వతంత్రం, శాంతి, అభివృద్ధి అనే లక్ష్యాలతో పి ఎస్ ఎఫ్ ఐ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

### సబ్సిడీపై వివిధ రకాల

## విత్తనాలు పంపిణీ



**ఎ.కొండూరు మే 31 (ఆంధ్రపత్రిక) :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు సబ్సిడీపై పంపిణీ చేసే వరి, పెసర, మినుము, కంది, కొర్ర, రాగి, నువ్వులు విత్తనాలు కావలసిన రైతులు మీ యొక్క రైతు భరోసాకేంద్రం సిబ్బందికి ముందుగా తెలియచేసినట్లయితే ఇండెంట్ పెట్టి విత్తనాలను సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచగ లము. ఈ అవకాశాన్ని మండలములోని రైతుసోదరులు వినియోగించుకోగ లరని వ్యవసాయ శాఖ అధికారి షేక్ టిప్పు సుల్తాన్ విజ్ఞప్తి చేశారు.

### చలివేంద్రంలో

## మజ్జిగ పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు



**మైలవరం, మే 31: (ఆంధ్రపత్రిక) :** మండలం లోని వెల్వడం సమీపంలో లక్కిరెడ్డి పాపులమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థుల సహకారం తో వెల్వడం చలివేంద్రములో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీమతి లకిరెడ్డి పాపులమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 1987-1992 సంవత్సరాలలో 6 నుండి 10 వతరగతివరకు చదువుకొన్న పూర్వపు విద్యార్థుల సంఘం సహకారముతో వెల్వడం మెయిన్ సెంటర్ నందు గత రెండు నెలలకు పైగా నిర్వహిస్తున్న కూలింగ్ మంచి నీటి చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. బొగ్గుల వెంకట శ్రీనివాస రెడ్డి వారి ధర్మపత్ని కృష్ణ వేణి సహకారం తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విద్యార్థి సంఘం నాయకులు గూడూరు నాగి రెడ్డి తెలిపారు. సుమారు 1000 మంది కి పైగా చల్లటి మజ్జిగ ను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మథర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీమతి కోయ సుధ మరియు మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి ద్రోణవల్లి విజయలక్ష్మి విచ్చేసి మజ్జిగ పంపిణీ ని చేశారు. మజ్జిగ పంపిణీ లో గ్రామస్తులు విరివిగా పాల్గొని మజ్జిగ సేవించడం జరిగింది. ఆర్టీసీ బస్సు లలో ప్రయాణించే వారికీ, ద్విచక్ర వాహనదారులను, ఇతర ప్రయాణీకులను ఆపి మరి చల్లటి మజ్జిగను గూడూరు నాగి రెడ్డి, కోయ సుధ అందజేశారు. ఈ సందర్భంగా కోయ సుధ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరూ కలసి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వేసవి కాలం లో రోజు చల్లటి మంచి నీటి చలివేంద్రం తో పాటు మజ్జిగ పంపిణీ చేయడం చాలా అభినందనీయం అని, పూర్వ విద్యార్థులందరిని ఒక తాటిపైకి తీసుకొచ్చి ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించడంలో గూడూరు నాగిరెడ్డి కృషి చాలా మెచ్చతగినదని కొనియాడారు. పాపులమ్మ హై స్కూల్ పూర్వ విద్యార్థులు ఇటువంటి మంచి కార్యక్రమాలు మరిన్ని చేయాలనీ కోరారు. పాపులమ్మ హై స్కూల్ నందు చదువుకున్న విద్యార్థులు అందరు కలసి ముందు ముందు మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామని, పూర్వపు విద్యార్థి సంఘం నాయకులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ మరియు ట్రెజరర్ గూడూరు నాగి రెడ్డి తెలియజేసారు. మజ్జిగ పంపిణీకి ఆర్థిక సహకారం అందించిన దంపతులను అభినందించారు. సంఘం తరుపున వేముల సూరయ్య, ఆనం వెంకటేశ్వర రావు, తాళ్లూరి మురళి, అంబటికేశవ రావు, జూలూరు ప్రసాద్, వీరంకి శ్రీధర్ హాజరైనారు.

### విత్తన షాపుల తనిఖీ నిర్వహించిన

## వ్యవసాయ శాఖాధికారి పి. పద్మ



**తిరువూరు మే 31 (ఆంధ్రపత్రిక) ;** తిరువూరు పట్టణంలోని విత్తన షాపు లను మండల వ్యవసాయ అధికారి పి.పద్మ శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు విత్తన డీలర్లకు రోజు స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు అప్డేట్ చేయాలని, ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మకాలు జరిపినా, బిల్లు ఇవ్వకుం డా అమ్మకాలు జరిపినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రైతులు తప్పనిసరిగా లైసెన్సు కలిగిన డీలరు వద్ద మాత్రమే బిల్లు తీసుకుని విత్తనాలు కొనుగోలు చేయాలని, బయట లూజు గా దొరికే నాసిరకం విత్తనాలు కానీ, లైసెన్సు లేని వారు అమ్మే విత్తనాలు కానీ కొని మోస పోవద్దని సూచించారు. విత్తనాలు కొన్న బిల్లును పంట పూర్తయ్యే వరకు జాగ్రత్త గా దాచుకుని ఉంచుకోవాలని రైతులకు సూచించారు

## నజీర్ షరీజున్నీసా సేవలు అభినందనీయం




**నూజివీడు మే 31 (ఆంధ్రపత్రిక) :** సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించిన షేక్ నజీర్ షరీజు న్నీసా సేవలు ప్రశంసనీయమని అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి రావి రవి ప్రసాద్ అన్నా రు. నూజివీడు పట్టణంలోని రామాయమ్మా రావుపేటలో గల అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధి కారి కార్యాలయ ఆవరణములో నజీర్ షరీజు న్నీసా దంపతుల పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి రావి రవి ప్రసాద్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం 36 సంవత్సరాల పాటు వార్డెన్ గా నజీర్ షరీజున్నీసా సేవలను అందించినట్లు తెలిపారు. ఎక్కడ విధులు నిర్వర్తించిన ఆయా ప్రాంతాలలోని అన్ని వర్గాల ప్రజల ప్రశంసలు అభినందనలు పొందిన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. సాంకేతికపరంగా నేడు నజీర్ షరీజున్నీసా పదవీ విరమణ పొందుతున్నప్పటికీ, శాశ్వతంగా తమతోపాటే నిత్యం అన్ని రకాల బాధ్యతలను పంచుకుంటూ, తమలో ఒకరిగా మెసలాలని సూచించారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరినీ సమదృష్టితో భావిస్తూ, సమ గౌరవాన్ని అందించి అందరినీ ఆదరించడం నజీర్ షరీజున్నీసా కే దక్కిందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది నజీర్ షరీజున్నీసా సేవల పట్ల ప్రశంసల జల్లు కురిపించారు. అనంతరం ప్రేమ విందు అందరూ స్వీకరించారు.

### ఎన్డియే కూటమిని

## ప్రజలు కోరుకొని హర్షించారు

### నూజివీడు బీజేపీ కన్వీనర్ : ఆర్ కే రంగారావు

**నూజివీడు 31 మే (ఆంధ్రపత్రిక) :** అవసరం కోసం నాయకులు కూటమిగా ఏర్పడవచ్చు కాని రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్డిఏ ఏర్పడిన కూటమి సాధారణ ప్రజలు సైతం మనస్ఫూర్తిగా కోరుకుంటున్న విషయం యదార్థం అని. భారతీయ జనతా పార్టీ.నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఆర్ కే రంగారావు అన్నారు. 2014లో సైతం పవన్ కళ్యాణ్ బయట ఉండి బలపరిచిన భారతీయ జనతా పార్టీ మరియు తెలుగుదేశం పార్టీల కూటమికే ప్రజలు మద్దతు ఇవ్వడం జరిగింది. కేంద్ర-రాష్ట్రాలలో ఒకే కూటమి అధికారంలో ఉండడం వలన వచ్చేటువంటి లబ్ధిని పూర్తిగా పొందకముందే,ఒక దుష్టశక్తి పన్నిన పన్నాగంలో ఇరుక్కుని దీర్ఘకాలం అనుభవం ఉన్న ఉభయ పార్టీలకు చెందిన నాయకులు అపోహలకు లోనై,తప్పుడు అంచనాలు వేసి వైఫల్యం చెందడంతో 2019 లో వైస్సార్సీపీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రవర్తించడం జరిగింది. దీంతో రాష్ట్రం సర్వ విధాల భ్రష్టు పట్టింది. తమ తప్పులు తెలుసుకొని 2024 లో కూటమిగా ఏర్పడి-ముఖ్యంగా అశేష సాధారణ ఆంధ్ర ప్రజలు కోరుకుంటున్న విధంగా పోటీ చేయటంతో ది 04 జూన్2024 న జరిగే లెక్కింపుతో రాష్ట్రానికి పట్టిన ఒక పెద్ద పీడ వదిలిపోవడం అనేది షురూ! తాను కొంత తగ్గి ఈ కూటమి ఏర్పడటానికి ముఖ్య ప్రోత్సాహకులైనటువంటి పవన్ కళ్యాణ్ గారికి మరియు తన శక్తిమేర ఇతోదికంగా కృషిచేసిన రఘురామకృష్ణం రాజు గారికి అభినందనలు తెలియపరచవలసి యున్నది.రాబోయే కాలంలో రాష్ట్రంలోనూ-కేంద్రంలోనూ ఏర్పడబోయే ఎన్ డి ఏ కూటమి మన రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కారు ఏర్పడి ఇక నుంచి అయినా అభివృద్ధి మరియు సంక్షేమ సమతుల్యంతో పరిపాలన సాగి రాష్ట్రం అభివృద్ధి చెంది-దేశంలోనే అగ్రగామిగా నిలబడి- అమరావతి రాజధానిగా-ప్రపంచ పట్టణాలలో ఒకటిగా పేరు పొందుతున్నారు.

## డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడడం ఖాయం



**ఆగిరిపల్లి మే 31 (ఆంధ్రపత్రిక) :** ఆగిరిపల్లిలో నూజివీడు బిజెపి పార్టీ సమన్వయకర్త జి ఆర్ కే రంగారావు తన కార్యాలయంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడడం ఖాయమని ఇకనుంచి అయినా సమతుల్యంతో పరిపాలన సాగి రాష్ట్రం అభివృద్ధి చెంది దేశంలోనే అగ్రగామిగా నిలబడి అమరావతి మంచి రాజధానిగా ప్రపంచపట్టణాల్లో ఒకటిగా పేరు పొందాలని కోరుకుంటున్నాను అని, రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్డీఏ గా ఏర్పడిన కూటమి సాధారణ ప్రజలు సైతం మనస్ఫూర్తిగా కోరుకుంటూన్న విషయం యథార్థం అని,2014 లో కూడా పవన్ కళ్యాణ్ బయట నుండి బలపరిచారని, కేంద్రం రాష్ట్రాలలో ఒకే కూటమిలో గల ప్రభుత్వాలు ఏర్పడినట్లైతే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, 2019లో వైయస్సార్ సిపి పార్టీ అధికారంలో కి వచ్చినప్పటినుండి అభివృద్ధి అనేది ఏ మాత్రం లేదని, ఈనెల 4వ తారీఖున జరిగే ఓట్ల లెక్కింపు తో రాష్ట్రానికి కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని, రాష్ట్రంలో మూడు పార్టీలు"బిజెపి, తెలుగుదేశం, జనసేన"కలసి కూటమిగా ఏర్పాటుకు శక్తి మేర కృషిచేసిన రఘురామ కృష్ణంరాజు, పవన్ కళ్యాణ్ కు అభినందనలు తెలిపారు

### విద్యార్థుల క్షేమం కొరకు

## వేసవి సెలవులను పొడిగించండి

### రాష్ట్ర ప్రభుత్వానికి గాంధీ నాగరాజన్ విజ్ఞప్తి



**విజయవాడ పశ్చిమ, మే 31, (ఆంధ్రపత్రిక) :** ఈ ఏడాది వేసవిలో రాను రాను పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దరిమిలా కళాశాలలకు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వేసవి సెలవులు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గాంధిదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆర్ ఆర్ గాంధీ నాగరాజన్ శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఓ పక్కన విజయవాడలో కలుషిత తాగునీరు ప్రజలు ప్రాణాలు తీస్తున్నాయి. మరోవైపు సూర్య భగవానుడు తీవ్ర ఉగ్రరూపం దాల్చిన చందంగా ఎండలు భగ భగ మండుతున్నాయి. ఇలాంటి తరుణంలో స్కూళ్లు కాలేజీలు పునప్రారంభం జరిగుతే,ఏ స్థాయి విద్యార్థులైనా వడదెబ్బకి గురయ్యే ప్రమాదం ఉందనీ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిప్పులు చెరుగుతున్నఎండలు తగ్గేవరకూ పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించవద్దని, వాతావరణం మార్పులు చెంది చల్ల బడిన తరువాత ప్రారంభించమని గాంధీ నాగరాజన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఈ లోపు కరెంట్ కోతలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పాపారాయుడికి పెదప్రోలు గ్రామస్థాయి అధికారుల అండదండలు

## పెదప్రోలులో నానాటికీ పెరుగుతున్న ఆక్రమణల పర్వం



**మోపిదేవి 31 మే (ఆంధ్రపత్రిక) :** మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామ పంచాయితీలో పాపారాయుడికి అధికారుల అండదండలు పూర్తి స్థాయిలో ఉంది. ఎవరికి ఏం జరిగితే మాకేంటి, ఎవరు ఎలా పోతే మాకేమిటి సంబంధం అనే విధంగా పెదప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలో అధికారుల తీరు ఉండ నటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు నిలిపివేసిన స్పందన కార్యక్రమంలో గతంలో పలుమార్లు పెదప్రోలు పరిధిలో పలు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ వద్ద పలువురు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదిదారులు లేకుండానే స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యంగా అధికారులు మూసివేశారు. ఆక్రమణలపై నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడానికి కాసులకు కక్కుర్తి పడటమేనని ముఖ్యంగా రెవెన్యూ గ్రామస్థాయి అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వివరాలలోకి వెళితే....... పెదప్రోలు స్మశాన వాటిక సమీపంలో కఫ్తానుపాలెం కోళ్ల ఫారాల ఎదురుగా గల పశు వైద్యశాల ప్రక్కన గల స్థలాన్ని యజమాని నుంచి పెదప్రోలు కు చెందిన వ్యక్తి కొనుగోలు చేశాడు. సదరు వ్యక్తి ఆ స్థలంలో ఉన్న కట్టడాన్ని విస్తరిస్తూ భారీ నిర్మాణం చేపట్టాడు. ప్రక్కనే గల డ్రైనేజీ, జాతీయ రహదారి ప్రక్కనగల స్థలాలను ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో, రంగంలోకి దిగిన పంచాయతీ, రెవిన్యూ అధికారులు సదరు ప్రదేశానికి వెళ్లి హడావిడి చేసి, నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. కానీ మరుసటి రోజు నుంచి యదేచ్ఛగా నిర్మాణం చేపడుతున్నా, అటువైపు సదరు అధికారులు కన్నెత్తి చూడకపోవడం సిగ్గుచేటు. జాతీయ రహదారికి కనీసం అడుగు దూరం కూడా లేకుండా సదరు వ్యక్తి నిర్మాణం చేస్తున్నాడంటే...... ఏ స్థాయిలో ఆక్రమణ జరుగుతుందో ఊహించవచ్చు. అధికారుల తీరుపై సోషల్ మీడియాతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో చేసేదిలేక గ్రామ స్థాయి అధికారులు సదరు వ్యక్తి వద్దకు వెళ్లి, సర్వే చేసి ఆక్రమణను గుర్తించి, తొలగించాలన్నారు. 30 రోజులలోపు ఆక్రమణలు తొలగిస్తానని చెప్పిన సదరు యజమాని, రెండు నెలలు పైబడి కావస్తున్నా నిర్మాణం కూల కొట్టకపోగా, నేటికీ యదేచ్ఛగా, నిస్సిగ్గుగా నిర్మాణాలు మరింత విస్తారంగా చేపట్టాడు. అలాగే కఫ్తానుపాలెం వద్ద మలుపులో నూతనంగా ఏర్పాటు చేసిన ఒక రెస్టారెంట్ నిర్మాణం జాతీయ రహదారిని ఆనుకుని, అక్రమాలకు తెర లేపాడు. సదరు హోటల్ నిర్మాణం చేపడుతున్న సమయంలోనే స్పందన కార్యక్రమంలో ఆక్రమణపై స్పందనలో ఫిర్యాదు చేసినా నేటికీ ఉపయోగం లేదు. సదరు హోటల్ యజమానికి జాతీయ రహదారి అధికారులు నోటీసు ఇచ్చినా, గ్రామస్థాయి అధికారులకు ఆక్రమణ కనపడకపోవడం వారి అంధత్వానికి నిదర్శనం. సదరు ఆక్రమణ విషయాలపై ఉన్నతాధికారులు స్పందించి, ఆక్రమణలు తొలగించవలసినదిగా ప్రజలు కోరుతున్నారు.

# చంద్రబాబును కలిసిన వేదవ్యాస్



**మచిలీపట్నం, మే 30 (ఆంధ్రపత్రిక) :** పెడన మాజీ ఎమ్మెల్యే,మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వెదవ్యాస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బూరగడ్డ కిషన్ తేజ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజి డిప్యూటీ స్పీకర్ , పెడన మాజీ ఎమ్మెల్యే తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును హైదరాబాద్‌లో వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వీరు ప్రస్తుత రాజకీయ అంశాలపై మాట్లాడుకున్నారు. అలాగే మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో కౌంటింగ్ కి సంబంధించి తీసుకుంటున్న జాగ్రత్తలు, అందుకు సంబంధించి జరుగుతున్న పనుల వివరాలు చంద్రబాబు వేదవ్యాస్ ను అడిగి తెలుసుకోవటంతో పాటు, కొన్ని సలహాలు, సూచనలు అందించారని వేదవ్యాస్ మీడియాకి తెలిపారు.

## మధ్యాహ్న భోజన హెల్పర్లకు

# ఒక్కరోజు శిక్షణ



**హిందూపురం, మే 31 (ఆంధ్రపత్రిక) :** హిందూపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం వంట సహాయకులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని అజిజియా ఉన్నత పాఠశాలలో ఎంఈఓ గంగప్ప, ప్రసన్నలక్ష్మిల ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం తయారుచేయు విధానంను కేఆర్పి వెంకట లక్ష్మమ్మ తెలియజేశారు.. విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం భోజనం బాగా చేసిన ముగ్గురుకి బహుమతులు ప్రధానం చేశారు. ఇందులో మొదటి బహుమతి అజీజియ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ ఆసిఫ్ కు, రెండవ బహుమతి ముదిరెడ్డిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న లక్ష్మీదేవికి, మూడవ బహుమతి పొట్టి శ్రీరాములు పాఠశాలలో ఏజెన్సీ ఫరీదాకు మండల విద్యాశాఖ అధికారులు అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తౌసిఫ్ ఖాన్ ,ప్రవీణ్ కుమార్ ,సురేష్ బాబు,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఖ

## తెలుగుదేశం పార్టీ నాయకులను పరామర్శించిన పరిటాల శ్రీరామ్, ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం మే 31 (ఆంధ్రపత్రిక) :** సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం పట్టణంలోని 27వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుడు తిరుపాల్ మీద అదే విధంగా 28వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుడు కుల్లాయప్ప పై దాడి జరిగిన విషయం అందరికీ విధితమే. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఎన్ డి ఏ ఎమ్మెల్యే అభ్యర్థి సత్య కుమార్ యాదవ్ లు ఆ కుటుంబాల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించి తమ భరోసాను కల్పించారు. వచ్చే ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ ప్రభుత్వం తప్పక వస్తుందని, అందరికీ న్యాయం జరుగుతుందని వారు తెలిపారు. దాడి చేసిన వారిని వదిలే ప్రశక్తి లేదని, కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా కృషి చేస్తామని వారు ఇరువురు ఆ కుటుంబాలకు హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ అధికారులకు ఉద్యోగ పదవి విరమణ సహజం

## – ధర్మవరం డి.ఎస్.పి.శ్రీనివాసులు



**చెన్నేకొత్తపల్లి మే 31 (ఆంధ్రపత్రిక) :** ప్రభుత్వ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు ఉద్యోగ పదవి విరమణ పొందడం సహజమని, కానీ ఉద్యోగ విధులలోకి చెరినప్పటి నుండి ఉద్యోగ పదవి విరమణ వరకు ఎటువంటి ఆరోపణలు లేకుండా పదవి విరమణ పొందడం అదృష్టం గా భావించాలని ధర్మవరం డి. ఎస్.పి.ఎ శ్రీనివాసలు అన్నారు.శుక్రవారంనాడు మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్ లో ఎ. ఎస్.ఐ గా విధులు నిర్వహిస్తున్న డి. ఇబ్రహీం ఖలీల్ భాష, తన ఉద్యోగ పదవి విరమణ పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మవరం డి. ఎస్. పి.ఎ శ్రీనివాసులు, వచ్చి పై విధంగా అన్నారు. ఆయన తో పాటుగా రామగిరి సి.ఐ. ఓ శివాంజినేయలు, చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. పి. వెంకటేశ్వర్లు తమ పోలీస్ సిబ్బందితో కలిసి, పదవి విరమణ పొందిన ఎ. ఎస్.ఐ ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## 30 ఏళ్లుగా గ్రామ పంచాయితీ కార్యదర్శిగా గ్రామీణాభివృద్ధిలో కడియాల లక్ష్మి సేవలు అభినందనీయం

### జిల్లా పంచాయితీ శాఖ అధికారి శ్రీదేవి



**గుంటూరు : మే 31 (ఆంధ్రపత్రిక) :** పట్టుదల క్రమశిక్షణతో ఉద్యోగ వృత్తి పట్ల అంకిత భావంతో 30 ఏళ్లుగా గ్రామ పంచాయితీ కార్య దర్శిగా వివిధ చోట్ల పనిచేసి గ్రామీణాభి వృద్ధిలో భాగస్వామిగా కడియాల లక్ష్మి సేవలు అభినంద నీయని జిల్లా పంచాయితీ శాఖ అధికారి శ్రీదేవి, డి.ఎల్.ఓ వజ్రాల సుజాత. ఎండిఓ ఎస్ .ఆదినారాయణ, రురల్ ఎంపిపి ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి కొని యాడారు. గుంటూరు రురల్ మండలం చల్లవారిపాలెం గ్రామ పంచాయితీ కార్యదర్శి కడియాల లక్ష్మి పదవి విరమణ శుక్రవారం రురల్ మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎండిఓ ఎస్ .ఆదినారాయణ అధ్యక్షతన ఘనంగా జరిగింది. అధికారులు సహోద్యోగులు దూశాలువలు జ్ఞాపికలు పూలమాలతో సత్కరించి ఉద్యోగవిదులలో ఉత్తమ ఉద్యోగినిగా కడియాల లక్ష్మి ఏవిధంగా అనికితభావం తో బాధ్యతాయుతంగా పనిచేసారో కొనియాడుతూ తమ అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. కష్టకాలంలో మానసికంగా దృడంగా ఎలావుండాలో లక్ష్మి ఎంతో ఆదర్శప్రాయురాలని అధికారులు కొనియాడారు. సాయంత్రం చల్లవారిపాలెం గ్రామంలో సర్పంచ్ అరుదల సాంబశివరావు ఆధ్వర్యంలో చల్లవారిపాలెం గ్రామ పంచాయితి సిబ్బంది ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డీ కె.శ్రీనివాసరావు,ఎంఇఓ వెంకటేశ్వర్లు,ఎఇ రమేష్,హౌసింగ్ ఎఇ సత్యన్నారాయణ,సూపెర్నెంట్ శోభారాణి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి,పంచాయితి కార్యదర్సులురమణయ్య,యమున,ఆంజనేయ ప్రసాద్,మీనాక్షి,జోత్స్న, రాయప్ప,భూషణం, వెంగళాయపాలెం సర్పంచ్ లలిత,రురల్ మండల ఎంపీటీసీలు కార్యాలయ సిబ్బంది కుటుంబసభ్యులు భర్త రావి పాటి నాగేశ్వరావు, కొడుకు రావిపాటి సాయి కృష్ణ,కోడలు డాక్టర్ రాధిక,కుమార్తె గొల్లపూడి పూజిత, అల్లుడు గొల్లపూడి దిలీప్, మరియు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పెద్దసంఖ్యలో పాల్గున్నారు.

## కౌంటింగ్ సందర్భంగా కవ్వింపు చర్యలకు పాల్పడితే

# కఠిన చర్యలు తీసుకుంటాం

### (హిందూపురం డి.ఎస్.పి కన్జక్షన్)



**లేపాక్షి మే 31 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న జరుగుతున్న సందర్భంలో లేపాక్షి మండలంలోని రౌడీషీటర్లకు ట్రబుల్ మాంగర్స్ కు హిందూపురం డి.ఎస్.పి కంజక్షన్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ కార్యక్రమం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలోని మండల పరిధిలో ఉన్న గ్రామాలలో ఉన్న రౌడీషీటర్స్ ను ట్రబుల్ మాంగర్స్ ను గుర్తించి కౌంటింగ్ సందర్భంగాప్రజాశాంతికి భంగం వాటిల్లకుండా చూడాలని తెలియజేశారు. ఎవరైనా ప్రజాశాంతికి భంగం కలిగి చర్యలు చేసినట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు. ఎన్నికల కౌంటింగ్ రోజైన జూన్ 4న, 144 సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎవరూ ఎటువంటి గొడవలకు పాల్పడకూడదని, ఎవరు కూడా బాణసంచా కాల్చరాదని, ఎవరు కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని అట్లు చేసిన వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా కౌంటింగ్ రోజున డ్రోన్ కెమెరాల పరిరక్షణలో నిఘా నిర్వహించడం జరుగుతుందని, మరీ ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలైన కల్లూరు కొండూరు లేపాక్షి మైదుగోళం కంచి సముద్రం మరియు చోల సముద్రం గ్రామాలలో ప్రత్యేక సాయుధ బలగాలు మోహరింపబడతాయని తెలియజేశారు. కాబట్టి ఎవరు కూడా కౌ ంటింగ్ సందర్భంగా కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉండాలని తెలియజేశారు. ఒకవేళ చట్టానికి వ్యతిరేకంగా అలాంటి కార్యక్రమాలు చేసినట్లయితే వారి తాట తీస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం డిఎస్పి కంజక్షన్ ,రూరల్ సీఐ ఈరన్న స్థానిక ఎస్సై గోపి మరియు పోలీస్ సిబ్బంది రౌడీషీటర్లు ట్రబుల్ మాంగర్స్ పాల్గొన్నారు.

## వివిఐటిలో ముగిసిన ఎన్.సి.సి వార్షిక శిక్షణా శిబిరం



**గుంటూరు : మే 31 (ఆంధ్రపత్రిక) :** వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో గత పదిరోజులుగా నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం ఘనమైన వేడుకలతో ముగి సింది. వివిధ విద్యాసంస్థలకు చెందిన 632 మంది క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొని దేశభక్తి, క్రమ శిక్షణ, నాయకత్వలక్షణాలను పెం పొందించుకున్నారనీ తొలిసారిగా ఏర్పాటుచేసిన సాహసవిన్యాస పోటీలలో విద్యార్థులు ప్రదర్శించిన స్ఫూర్తి ప్రసంసనీయమని బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.ఏ.ఎస్ సుదర్శన్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరం నందు కెడెట్లకు వ్యాయామం, పరుగు, యోగా, కవాతు అయుదాల పైఅవగాహన, ఫైర్ ఫైటింగ్, సి.పి.ఆర్, మ్యాప్ రీడింగ్, త్రివిధ దళాలకు సంభందించిన అంశాలపై శిక్షణను అందించారు. రోప్వే, కొండలు ఎక్కడం వంటి సాహసకృత్యాలతోపాటు వాలిబాల్, ఖోఖో వంటి ఆటలలో పోటీలు నిర్వహించి పురస్కారాలు అందించారు. ముగింపు వేడుకలలో భాగంగా క్యాడెట్లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ భక్తిగీతాలకు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ శిక్షణాశిబిరంలో నిర్వహించిన పోటీలలో 25 మంది వివిఐటి విద్యార్థులు ప్రతిభ కనబరచి పురస్కారాలు దక్కించుకున్నారు.. ఈ కార్యక్రమములో బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎన్.వీ.ఎన్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వివిఐటి ఎన్.సి.సి ఆఫీసర్ డా ఎ. శ్రీవాణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అబ్బురపరచిన జానపద కళారూపాలు మైమరపించిన నృత్య ప్రదర్శనలు

### ఉత్తమ ఉపాధ్యాయులను, కవులను, కళాకారులను సత్కరించిన నార్త్ అమెరికా తెలుగు సంఘం



**గుంటూరుమే 31 (ఆంధ్రపత్రిక) :** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జానపద సంబరాలు పేరుతో పెద్ద ఎత్తున జానపద కళాకారులు గిరిజన వాయిద్య ప్రదర్శనలతో హోరెత్తించారు. శ్రీకాకుళం విజయనగరం, ఉభయగోదావరి, నల్గొండ, ఖమ్మం, కృష్ణాజిల్లాల నుండి జానపద, గిరిజన కళాకారులు సాంప్రదాయ వస్త్రధారణలతో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు డప్పు వాయిద్యాల మధ్య కళారూపాలు, బుర్రకథలు, ఆహుతలను మైమరపించాయి. చింతల యాదగిరి, ప్రజా కళామండలి పీవీ రమణ, రంగం రాజేష్ లు తమ బృందంతో ఆలపించిన సామాజిక చైతన్య గీతాలు అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో అధ్యక్షులు నూతి పాపయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామీణ, అర్బన్ ప్రాంతాలలో విద్య, వైద్య సేవలతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులను, కవులను, కళాకారులను సత్కరించడం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో కరోనా అనంతరం ఏర్పడిన క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న జానపద కళాకారులకు చేత చేయూత అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. శాసనసభ మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జన్మనిచ్చిన మాతృదేశం లోని ప్రజలకు ముఖ్యంగా తెలుగు ప్రజల సంక్షేమం, వారి లోని నైపుణ్యాలను వెలికి తీసే విధంగా కృషి చేస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలియజేశారు. కార్యక్రమంలో నాట్స్ డల్లాస్ సమన్వయకర్త శ్రీరామనేని సత్య, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి,పాటిబండ్ల విష్ణు, కృష్ణేశ్వరరావు, కార్యక్రమం సమన్వయ కర్త కాకుమాను నాగేశ్వరరావు, దాసరి రమేష్, దాసరి సుబ్బారావు, సరిమళ్ల చౌదరి, షేక్ బాషా, భగవాన్ దాస్, లక్ష్మణరావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఘనంగా హనుమజ్జయంతి

# వేడుకలు నిర్వహిస్తాం

### కొండలమ్మ దేవస్థాన ఆలయ ఈవో కానూరి సురేష్ బాబు.!



**వేమవరం (గుడ్లవల్లేరు మండలం) మే 31 (ఆంధ్రపత్రిక) :** హనుమజ్జయంతి సందర్భంగా శనివారం గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థాన దత్తత గ్రామమైన రెడ్డిపాలెంలో, వైభవంగా శనివారం ఉదయం 7 గంటల నుండి హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తామని, స్వామి వారికి అభిషేకం, అర్చన, తమలపాకులతో పూజలు, ఫల పుష్పాదులతో అలంకరణలు, కళ్యాణం, అనంతరం తీర్థ ప్రసాదాలు అందిస్తామని, గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తామని భక్తులు విరివిగా పాల్గొని శ్రీమద్ హనుమాన్ కృపాకటాక్షాలు పొందాలని ఆలయ ఈవో కానూరు సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## బంటుమిల్లిలో ఘనంగా

# హనుమాన్ విజయ శోభాయాత్ర



**బంటుమిల్లి 31 మే (ఆంధ్రపత్రిక) :** బంటుమిల్లి లో హనుమత్ జయంతి సందర్భంగా,శ్రీ హనుమాన్ విజయ యాత్ర భక్తి పూర్వక బైక్ ర్యాలీ జరిగింది. హిందువులలో ఐక్యతే ప్రధాన లక్ష్యంగా రామ నామ జపంతో వేలాది బైకులతో కదిలే హనుమాన్ శోభయాత్ర. అసంఘటితంగా ఉన్న హైందవ సమాజానికి ఒక తాటిపై తీసుకువచ్చి మన సనాతన ధర్మము, ఆచార సాంప్రదాయాలను కాపాడుకోవాలని లక్ష్యంగా, ప్రధానంగా హిందువులలో ఐక్యత మరియు చైతన్యమే ధ్యేయంగా భారతీయు ల అంతరాత్మ అయినటువంటి శ్రీ రామచంద్ర ప్రభువు మరియు హనుమంతుని నామ స్మరణతో ఈ శోభయాత్ర భక్తి పూర్వకంగా జరిగింది. ఈ హనుమత్ శోభయాత్రకు శ్రీ కోటిలింగాల క్షేత్రం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శివ స్వామి పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్‌కు స్మార్ట్ ఎల్ఈడి టీవీ అందజేత




**హిందూపురం, మే 31 (ఆంధ్రపత్రిక) :** హిందూపురం ప్రెస్ క్లబ్ కు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానంద్ రూ. 27 వేల రూపాయల విలువగల టీవీని బహుమానంగా అందించారు. ఇటీవల కాలంలో రమానంద్ హిందూపురం నియోజకవర్గం వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు పోతున్నారు. దేవాలయాల పునర్నిర్మాణంలోనూ అదేవిధంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను ఆయన ఏర్పాటు చేసుకున్నారు. లేపాక్షి ఆలయ అభివృద్ధి కొరకు తనవంతుగా అనేక కార్యక్రమాలు చేయడం జరిగింది. ఇటీవల లేపాక్షి బ్రహ్మోత్సవాలు కూడా అంగరంగ వైభవంగా చేశారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు ఉన్న నేపథ్యంలో విలేకరులందరూ ప్రెస్ క్లబ్ లో ఫలితాలు వీక్షించడానికి స్మార్ట్ టీవీ కావాలని రమానందను కోరగా ఆయన వెంటనే స్పందించి ప్రెస్ క్లబ్ కు బహుమానంగా స్మార్ట్ టీవీని ఆయన కొనుగోలు చేయించడం జరిగింది. ఆయన ప్రస్తుతం అందుబాటు లేకున్నప్పటికీ విషయం తెలిపిన వెంటనే స్పందించి ప్రెస్ క్లబ్ టీవీని కొనుగోలు చేయించినందుకు ఆయనకు పాత్రికేయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొన్నారు.

## డిఈ వెంకటరమణ

# సేవలు అభినందనీయం



**హిందూపురం, మే 31 (ఆంధ్రపత్రిక) :** మున్సిపల్ డిఈగా వెంకటరమణ అందించిన సేవలు అభినందినీయమని కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. వెంకటరమణ 33 ఏళ్లుగా అనేక మున్సిపాలిటీలో వర్క్ ఇన్స్పెక్టర్ స్థాయి నుంచి డిఈ స్థాయి వరకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి పనిచేశారని అభినందించారు. వెంకటరమణ పదవీ విరమణ సన్మాన సమావేశాన్ని పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. హిందూపురంతో వెంకటరమణ మొదటి నుంచి విడదీయలేని అనుబంధం ఉందని ఇక్కడే ఏఈగా ఎన్నో సంవత్సరాల పాటు పనిచేసి పట్టణ అభివృద్ధికి పాటుపడినట్లు వక్తలు పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయన ఏ రోజు కిందిస్థాయి ఉద్యోగితో సైతం పరుషంగా మాట్లాడలేదని కఠిన పరిస్థితుల్లో సైతం సమర్థవంతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్ గా గతంలో ఎవరు తీసుకోలేని సమయంలో ఏఈ గా ఉంటూ ఇన్చార్జి కమిషనర్ గా పనిచేసిన ఘనత వెంకటరమణకే దక్కుతుందని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. ఎంత పని ఉన్న చిరునవ్వుతో పనిచేసే వ్యక్తిత్వం ఆయన అని కొనియాడారు. అనంతరం వెంకటరమణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పలు మున్సిపాలిటీలో నుంచి ఉద్యోగులు తరలివచ్చారు. వెంకటరమణతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఆనంద్ రాజ్, నరసింహులు, సునీల్, నాగేంద్ర, కాంట్రాక్టర్లు వైసీ ప్రభాకర్, రంగనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, బాలాజీతో పాటు కాంట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లాలో డ్రోన్ లతో పటిష్ట నిఘా

## ఎవరైనా అల్లర్లకు ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు - పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి



**బాపట్ల మే 31 (ఆంధ్రపత్రిక) :** జూన్ 3న సాయంత్రం నుండి జిల్లాలో 144 సెక్షన్ కఠినంగా అమలు పరచడం జరుగుతుందని, చీరాల, బాపట్ల, రేపల్లె, అద్దంకి లలో జూన్ 3న సాయంత్రం నుండి కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు దుకాణాలు, హోటళ్ళు ఇతర వ్యాపార సముదాయాలు తెరవడానికి వీలు లేదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మే శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు, పోలీస్ అధికారులు సిబ్బంది నిర్వహించవలసిన విధుల గురించి వివరించారు. జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. అక్కడక్కడ చిన్నచిన్న ఘర్షణలు చెలరేగినప్పటికీ వాటిని సమర్థవంతంగా కట్టడి చేయడంలో సఫలీకృతం అయ్యారన్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉంటే వారిని గుర్తించి బైండవర్ చేయాలన్నారు. గతంలో ఘర్షణలకు పాల్పడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని, మరల వారు ఏటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా వారిపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో జూన్ 3 వ తేది సాయంత్రం నుండి 144 సెక్షన్ కఠినంగా అమలుపరచాలని, చీరాల, బాపట్ల, అద్దంకి, రేపల్లె లలో మరింత కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. దుకాణాలు, హోటళ్ళు ఇతర వ్యాపార సముదాయాలు తెరవడానికి వీలు లేదన్నారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల ఇంటివద్ద, పార్టీ కార్యాలయాల వద్ద కంచ, బ్యారిగేట్స్, స్టాపర్స్ లు ఏర్పాటు చేసి కార్యకర్తలు, ఇతర ప్రజలు ఎవరు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 1 నుండి 5వ తేదీ వరకు హోటల్లు, లాడ్జిలు, రిసార్ట్స్ లను తరచూ తనిఖీ చేయాలని, వాటిలో బస చేసే వారి యొక్క వివరాలను తెలుసుకొని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడానికి అవకాశం ఉన్నవారు, గతంలో నేరాలకు పాల్పడిన వారు ఎవరైనా ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 1 నుండి జిల్లాలో షాడో పార్టీలను ఏర్పాటు చేయాలని, వీరు రాజకీయ పార్టీల అభ్యర్థులను ఎప్పటికప్పుడు అనుసరిస్తూ ఒకే సమయంలో రెండు పార్టీల అభ్యర్థులు ఒకే ప్రదేశంలో చేరుకునే అవకాశం ఉన్న, ఎదురుపడే అవకాశం ఉన్న వెంటనే సంబంధిత స్టేషన్ కు సమాచారం అందించాలని, అభ్యర్థుల ఇంటి వద్దకు, పార్టీ కార్యాలయాలకు కార్యకర్తలు, ప్రజలు చేరుకుంటే దానికి సంబంధించిన సమాచారాన్ని ఏస్.హెచ్.ఓ కు తెలియజేయాలన్నారు. వెంటనే స్టేషన్ ఏస్.హెచ్.ఓ లు అప్రమత్తంగా వ్యవహరించి ఘర్షణలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో డిఎస్పీలు సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ రోజున వారు ఎలా వ్యవహరించాలి, చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై తీసుకునే చర్యల గురించి వారికి అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారు గొడవలు పడే అవకాశం ఉంటుంది కనుక బహిరంగ ప్రదేశాలలో ఎవరు మద్యం సేవించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై స్పెషల్ రైడ్ లు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలను పోలీస్ అధికారులు తరచు సందర్శిస్తూ ఉండాలన్నారు. ఆ ప్రాంతాలలో పికెట్లను ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. చీరాల, బాపట్ల నియోజకవర్గాలలోని మార్గాలలో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయాలని, చెక్ పోస్టులలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి రాళ్లు, ఇనుప రాడ్లు, కర్రలు ఇతర వస్తువులు, మారణాయుధాలు ఉంటే ఆ వాహనాన్ని సీజ్ చేసి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు.

పోలీస్ సిబ్బంది లాఠీ, హెల్మెట్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. నాకాబంధీ నిర్వహించి సీజ్ చేయబడిన వాహనాలను కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు విడుదల చేయరాదని, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చెక్ చేసి రిలీజ్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత మాత్రమే వాటిని సంబంధిత వ్యక్తులకు అందజేయాలన్నారు. ఎన్నికల సమయంలో సమర్థవంతంగా విధులు నిర్వహించారని తద్వారా చెదురుమదురు ఘటనలో మినహా జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని జిల్లా ఎస్పీ పోలీస్ అదికారులు సిబ్బందిని అబినంది ంచినారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లా పోలీసు అధికారు లు సిబ్బంది చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని, జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవం తంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తలు ఎవరు రాజకీయ పార్టీల అభ్యర్థుల ఇంటి వద్దకు, పార్టీ కార్యాలయాలకు వెళ్ళవద్దని, ఎన్నికల కౌంటింగ్ ముందు, కౌంటింగ్ రోజు, ఆ తరువాత రోజు పోలీస్ ఆదేశాలను మీరి గుంపులుగా చేరిన అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 5 డ్రోన్ లతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని చీరాల, బాపట్ల, అద్దంకి, రేపల్లె ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే ఆ ప్రాంతాలలో డ్రోన్లను ఎగురవేసి వాటి సహాయంతో ఘర్షణలకు పాల్పడిన వారిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చెయ్యడం జరుగుతుందని, రౌడీషీట్ కూడా తెరవడం జరుగుతుందని హెచ్చరించారు. కౌంటింగ్ రోజు అభ్యర్థులు ఏజెంట్లను మాత్రమే వెంటపెట్టుకొని కౌంటింగ్ సెంటర్ వద్దకు చేరుకోవాలన్నారు. ఇతరులను తీసుకొని రావద్దని, ఒకవేళ ఎవరైనా వచ్చిన వారిని పంపించి వేయడం జరుగుతుందని, బాపట్ల పట్టణంలో ఎక్కడ ఉండడానికి వీలు ఉండదని, కావున ప్రజలు గమనించి ఎవ్వరు వారి ఇళ్లను వీడి కౌంటింగ్ సెంటర్ కు రావద్దని ఎస్పీ గారు సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చు ఏజెంట్లుకు సంబంధిత అధికారుల నుండి జారీ చేయబడిన గుర్తింపు కార్డు, ఫామ్ 18 తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అవి లేకుండా కౌంటింగ్ కేంద్రాలలోకి అనుమతించడం జరగదన్నారు. కౌంటింగ్ కేంద్రాలలోకి మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు. వాటిని క్లాక్ రూమ్ లోనే డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో 200 మీటర్ల పరిధిలో అభ్యర్థులను ఏజెంట్లను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరై నా ఏజెంట్లు అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రంలో ఘర్షణలకు పాల్పడిన, ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి రౌడీషీట్ తేరుస్తామని హెచ్చరించారు. ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లిన ఏజెంట్ ను కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు బయటకి పంపడం కుదరదన్నారు. ఎవరైనా ఎక్కడైనా ఘర్షణలకు అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు వచ్చిన వాహనాలను పోలీసు అధికారులు సూచించిన పార్కింగ్ ప్రదేశాలలో నిలుపుకోవాలన్నారు. సంబంధిత అధికారులు జారీ చేసిన పాసులు ఉన్న మీడియా మిత్రులను అనుమతించడం జరుగుతుందని పాసులు లేని వారిని కౌంటింగ్ కేంద్రాల వద్దకు అనుమతించడం జరగదని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి పి విఠలేశ్వర్ , చీరాల డిఎస్పి బి.ప్రసాద్ , రేపల్లె డి.ఎస్.పి టి మురళీకృష్ణ జిల్లాలోని సిఐలు, స్టేషన్ ఏస్.హెచ్.ఓ ఇతర అదికారులు పాల్గొన్నారు.

# బాపట్ల మున్సిపాలిటీ అధ్వర్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు



**బాపట్ల మే 31 (ఆంధ్రపత్రిక) :** వేసవి కారణంగా పెరిగిన ఉష్ణోగ్రతలు దృష్టిలో పెట్టుకొని ప్రజల దహర్తిని తీర్చడానికి బాపట్ల మున్సిపాలిటీ అధ్వర్యంలో చలి వేంద్రాలను ఎర్పాటు చేసారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ ఆదేశాలతో పాత బస్టాండ్ రైల్వే స్టేషన్ ,జమ్మలపాలెం ఫ్లైఓవర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చీలు రోడ్ రామాలయం వద్ద చలి వేంద్రా లను ఏర్పాటు చేశారు. వీటిని డీఈ కె. శ్రీనివాసులు ప్రారంభించి మజ్జిగ ప్యాకెట్లు ప్రజలకు అందజేయడం జరిగింది.

# ఓట్ల లెక్కింపు విధుల్లో ఉద్యోగులు సమర్ధతతో పని చేయాలి



**బాపట్ల మే 31 (ఆంధ్రపత్రిక) :** ఓట్ల లెక్కింపు విధులకు నియమితులైన వారంతా సమర్థతతో పని చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు తెలిపారు. కమ్యూనికేషన్ సెంటర్, మీడియా సెంటర్, కంపెలేషన్ సెంటర్ లోని సిబ్బందికి శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు, పొరపాట్లు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా రెవెన్యూ అధికారి చెప్పారు. అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఆర్వోల సూచనలు పాటించాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్వోలు ధ్రువీకరించిన తదుపరి ఓట్ల లెక్కింపు వివరాలను మీడియాకు ప్రకటించాలని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు విధులలో ఉన్నవారంతా చాలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధివిధానాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, డిఐపీఆరోఓ సహాయ సంచాలకురాలు కె.సుభాషిణి, ఎపిఎంఐపి పీడీ వెంకటరమణ, ఏ-సెక్షన్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లలో గోవా మద్యం స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు



**బాపట్ల మే 31 (ఆంధ్రపత్రిక) :** అక్రమంగా గోవా మద్యాన్ని విక్రయం చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. బాపట్ల సెబ్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం బాపట్ల మండలం స్టూవర్ట్ పురం గ్రామంలో ముద్దాయిల నాన్ డ్యూటీ పైడ్ లిక్కర్ అమ్ముతుండగా ఉయ్యాల ఆనంద్, ఉయ్యాల అరుణ ను అరెస్ట్ చేయడం జరిగినదని తెలిపారు. వీరి వద్ద నుంచి 380 ఓ క్లాసిక్ విస్కీ క్వార్టర్ బాటిళ్లు, 40 మాన్షన్ హౌస్ గోవా మద్యం బాటిళ్లు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పట్టుబడిన మద్యం విలువరూ 45 వేలు ఉంటుందన్నారు. వీరిపై సెక్షన్ కేసు నమోదు చేశామన్నారు. వీరు గతంలో వీరిపై ఇలాంటి కేసులే ఉన్నాయని వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్సై గీతిక,సిబ్బంది పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితుడికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ సాయం



**బాపట్ల మే 31 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల:క్యాన్సర్ మహమ్మారి వ్యాధితో బాధపడుతున్న బాధితుడికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం బాపట్ల మరియరాణి కాలనీ లో నివాసం ఉంటున్న పొగడ్త ఆదిశేషు కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వృత్తి రీత్యా ఆధిశేషు రిక్షాలో పాత ఇనుప సమాను, పేపర్ లకు ఉల్లిపాయలు అమ్ముతూ తను కుటుంబాని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అనారోగ్యంతో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ను సంప్రదించగా సభ్యుల ఆమోదంతో గౌరవ అధ్యక్షులు వెజెండ్ల శ్రీనివాసరావు వెంటనే స్పందించి వారికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితుడికి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మెరుగైన చికిత్స కోసం అవసరం అయ్యే ఆర్థిక నిధులను అందించాలని కోరారు. తమ ఆర్గనైజేషన్ సభ్యుల సహకారంతో కొంత ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బండ్రెడ్డి గోపి,ట్రెజరర్ జోగి సువర్ణ,సభ్యులు కందుల శ్రీకాంత్, యాసం రాజా రమేష్,చామర్తి సుబ్బారావు, బీమా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు మలబార్ గోల్డ్ , డైమండ్స్, షోరూంలో "మైన్" డైమండ్ షో



**గుంటూరు : మే 31( ఆంధ్రపత్రిక ):** ప్రపంచంలో అతి పెద్ద జ్యూవెలరీ సంస్థ ఒకటైన మలబార్ గోల్డ్ , డైమండ్స్ తమ గుంటూరు షోరూంలో "మైన్ డైమండ్స్" షోని ప్రారంభించింది. ఈ సంస్థ తమ గుంటూరు షోరూంలో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ డైమండ్ షోని ముఖ్య అతిధులు గా డా శ్రీహర్ష రావూరి MS(OBG), DNB(OBG), FRM, Fertility Specialist% మరియు పెద్ది రమణారావు వ్యాపారవేత్త చే, వినియోగదారులు, శ్రేయోభిలాషులు, మరియు మలబార్ గోల్డ్ , డైమండ్స్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు మరియు ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నారు మీకు నచ్చి సొంతం చేసుకొనే విధంగా కేవలం మలబార్ గోల్డ్ , డైమండ్స్ గుంటూరు షోరూంలో 31 మే నుండి 05 జూన్, 2024 వరకు ఈ డైమండ్ షో కొనసాగుతుంది అని షోరూం హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ లు తెలియజెసారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో 5% ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చు. తద్వారా భవిష్యత్తులో పెరిగే బంగారం ధరల నుండి లబ్ది పొందవచ్చు. ఈ ఆఫరు ద్వారా నగలు కొనుగోలు చేసిన వారు, బుక్ చేసిన రోజు ధర లేదా కొనుగోలు చేసిన రోజు ధర, ఏ ధర తక్కువ ఉంటే ఆ ధర చెల్లించే సదవకాశం ఉంది. మలబార్ గోల్డ్ , డైమండ్స్ నిబద్ధతలో భాగంగా, తమ వినియోగదారులకు 10 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుంది. స్వచ్ఛమైన బంగారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28-పాయింట్ల నాణ్యత పరీక్షలు నిర్వహించిన IGI మరియు GIA ధృవీకరించిన వజ్రాభరణాలు, బైబ్యాక్ గ్యారెంటీ, నాణ్యతను తనిఖీ చేయడానికి క్యారెట్ ఎనలైజర్, జీవితకాల నిర్వహణ మరియు బాధ్యతాయుతమైన మూలాల నుండి బంగారం సేకరణ వంటి వాగ్దానాలను అందిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ కుమార్ మరియు షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల సునామీని సృష్టించనున్న పెమ్మసాని రాజకీయంగా తొలి అడుగే చారిత్రాత్మకం

## ఆదర్శవంతమైన అభివృద్దే లక్ష్యం పెమ్మసాని గెలుపు ఇక లాంఛనమే

### జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి.



**గుంటూరు : మే 31(ఆంధ్రపత్రిక):** తన రాజకీయ అరంగేట్రంతోనే రాష్ట్రంలో సంచలనాలకు కేంద్రబిందువుగా మారిన గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్నికల ఫలితాల్లో ఓట్ల సునామీని సృష్టించనున్నారని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనివాసరావు తోటలో కూటమి ముందస్తు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార మార్పు తధ్యమని అందుకే కూటమి ముందస్తు విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ రాజకీయంగా వేసిన తొలి అడుగే చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. తన గెలుపుతో పాటూ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలను విజయతీరాలకు చేర్చటంలో పెమ్మసాని పాత్ర కీలకమని కొనియాడారు. కులమతాలకు , ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ పెమ్మసాని వెంటే నిలిచారన్నారు.

పెమ్మసాని విజయం లాం ఛనమని , రికార్డు స్థాయి మెజారిటీ కోసం ప్రజ లంతా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. వైసీపీ దురాగతాలను, దుర్మార్గాలను ధైర్యంగా ఎదురుకొని కూటమి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపటంలో పెమ్మసాని సఫలీకృత మయ్యారన్నారు. పార్లమెంట్ పరిధిలో దశాబ్దాలుగా కున్నారిల్లు తున్న సమస్యల పరిష్కారానికై ప్రత్యేక దృష్టి పెట్టడం ఎంతో ముదావహమన్నారు. ఎంపీ నిధులతో పాటూ అవసరమైతే సొంత నిధులతోనూ ఆదర్శవ ంతమైన అభివృద్ధికై పెమ్మసాని కృషి చేస్తారని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. మరో మూడు రోజుల్లో ఐదేళ్లుగా రాష్ట్రానికి పట్టిన అంధకారం తొలగిపోనుందని , ప్రజలందరి జీవితాల్లో వెలుగులు రానున్నా యని ఆళ్ళ హరి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీ న్, రెల్లి రాష్ట్ర నేత సోమి ఉదయ్ కుమార్, కూటమి నేతలు మారుతి కిషోర్ , నాజర్ వలి, సయ్యద్ , ఎర్రబోతు వాసు, పొగిరి ఫణి, పూసల శ్రీను కోలా మల్లి, చింతకాయల సాయి, నెల్లూరి శ్రీను, ఖర్జూ పోతురాజు , మణి , స్టూడియో బాలకృష్ణ , వడ్డె సుబ్బారావు , అడపా బాలకృష్ణ , తేజ పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ క్రాంతిపథం మరియు ఏపీసీఎన్ ఫ్ సిబ్బందికి అవగాహన సదస్సు

**కొరిశపాడు,మే 31(ఆంధ్రపత్రిక):** బల్లికురవ మండలంలోని ప్రకృతి



వ్యవసాయంలో పనిచే యుచున్న ఐసిఆర్ పిలు సీసీలు యూనిట్ ఇన్చార్జిలకు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగినది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాపట్ల జిల్లా లవ్లీహుడ్ డిపిఎం అనంతు లక్ష్మణాచారి మాట్లాడుతూ ప్రతిగ్రామ సమాఖ్యలోనూ స్వయం సహాయక సంఘములోను మండల సమాఖ్యలో ప్రకృతివ్యవసాయం ఒకఅజెండా పాయింట్ గా పెట్టాలని ఇందిరాక్రాంతి పథంసిబ్బందికి సూచించారు. గుర్తించిన గ్రామాలలో సెర్ప్ సిబ్బంది ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందికి సహకరించాలని ఆచారి తెలిపారు ప్రకృతి వ్యవసాయం జిల్లా డిపిఎం మోహన్ మాట్లాడుతూ విత్తనాల కిట్స్ ను విరివిగా తయారుచేసి రైతులకు ఇవ్వాలని సూచించారు. నవధాన్యాలను సాగుచేసి అధిక దిగుబడులు వచ్చేలాగా ఐసిఆర్ పిలు వారికి కేటాయించిన గ్రామాలలో రైతులకు తెలియపరచాలని డీపీఎం సూచించారు. ఈ సమావేశంలో ఏపిఎం బాచిన సురేంద్రబాబు, సీసీలు రాయి పేరయ్య, విజయరాణి ఎఫ్ పి ఓ ఫార్మర్ మిత్ర దమ్ము అంజయ్య యూనిట్ ఇన్చార్జిలు చల్లగుండ్ల "కల్పన" మద్దుమాల నాగాంజలి, వెంకట్రావు ఐ సి ఆర్ పి లు మహిళా రైతులు పాల్గొన్నారు .

# త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో స్వర్ణయుగం ప్రారంభం కానుంది

## టీడిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గళ్ళ మాధవి.





**గుంటూరు : మే 31( ఆంధ్రపత్రిక ):** ఆంధ్రప్రదేశ్ లో జూన్ 4 తరవాత స్వర్ణయుగం ప్రారంభం కానుందని, నారా చంద్రబాబు నాయుడు అను నేను ఒక్క పిలుపుతో ప్రజాపాలన మొదలు కానున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీమతి గళ్ల మాధవి ధీమా వ్యక్తం చేసారు. శుక్రవారం నాడు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం జి.టి రోడ్డులోని హాజరత్ కాలే మస్తాన్ వలి బాబా దర్గాలో గళ్ల మాధవి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. బాబాకు ప్రత్యేక చద్దర్ ను సమర్పించి కూటమి అధికారంలోకి వచ్చి ప్రజా రాజధాని అమరావతి త్వరగా పూర్తి అవ్వాలని, ప్రజా జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ప్రార్ధించారు. అనంతరం గుంటూరు బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి గుడిలో జరుగుతున్న విష్ణు సహస్ర నామాలు,లలిత సహస్రనామ పారాయణంలో గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్న కలిసి గళ్ళ మాధవి పాల్గొని పూజలు నిర్వహించారు. చంద్రబాబు చొరవతో రాజధాని అమరావతిలో టీటీడీ వెంకటేశ్వర స్వామి గుడిని నిర్మిస్తే, జగన్ మోహన్ రెడ్డి తిరుమల ప్రతిష్ఠతను మసకబారే విధంగా ప్రవర్తించరాని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల ఫలితాలు వైసీపీకి దిమ్మ తిరిగే విధముగా చేస్తాయని గళ్ళా మాధవి జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు,తెలుగుమహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సినీహీరో స్వర్గీయ ఘట్టమనేని కృష్ణ జయంతిని పురస్కరించుకొని గుంటూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారి గుడి వద్ద వారి చిత్రపటానికి పూలమాలలు గళ్ల మాధవి నివాళ్లర్పించారు.

ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ ఈ పేరు తెలుగు సినిమా ఉన్నంత కాలం గుర్తుండిపోయే పేరు అని, సూపర్ స్టార్ అనే పదానికి నిలువెత్తు నిదర్శనం కృష్ణ ఎందరో మహానుభావులతో పాటు తెలుగు సినిమా స్థాయిని పెంచారు కృష్ణ. తెలుగు సినిమాను కొత్త పుంతలు తొక్కించిన కృష్ణ గురించి ఎంత చెప్పిన తక్కువే. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాత తన ప్రతిభను చాటుకున్నారు కృష్ణ. దాదాపు 350కు పైగా సినిమాల్లో నటించి మెప్పించిన సూపర్ స్టార్ కృష్ణ తెలుగు ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

# నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులుగా లావు కృష్ణదేవరాయులు గెలవాలి



**వినుకొండ ,మే 31 (ఆంధ్రపత్రిక) :** వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జీవి ఆంజనేయులు గారు వీరిద్దరూ 4 వ తేదీన ఎంపీ ఎమ్మెల్యేగా గెలవాలని బొల్లాపల్లి మండలం లోని రెడ్డిపాలెం గ్రామంలో ఆర్సీఎం చర్చిలో బొల్లాపల్లి మండలం తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులు మోకాళ్ళ మీద ప్రార్ధన చేయడం జరిగింది.

ఈ ప్రార్థనలో పాల్గొన్నవారు రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, పమిడిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆదాము, రెడ్డిపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఊసి పట్ల వెంకట్రావు, మీసాల యోహాను, సికారామయ్య ,సికా కోటేశ్వరరావు, మన్నెం బుద్దయ్య ,మాదాసు లాభాను ,ధూపాటి ఎర్రకోటయ్య ,ధూపాటి బాబు ,మీసాల గాబ్రియేలు ,మోజేసు, గుంజరి నాసర బాబు, కటికల చంద్రశేఖర్ రాగిపాటి దావీదు తదితరులు పాల్గొన్నారు.

# నికోటిన్ చక్రబంధం నుంచి బయటపడండి

**ఊపిరితిత్తులు క్యాన్సర్ వ్యాధులకు కారణమైన పొగాకు, గుట్కా, ఖైనీ దూరంగా ఉండండి.**

**జిల్లా కలెక్టర్ యస్ డిల్లీరావు.**




**విజయవాడ,మే31 (ఆంధ్రపత్రిక):** మత్తుపద్దార్థాల వల్ల కలిగే అనార్థాలను వివరించి ఊపిరితిత్తులు, క్యాన్సర్ వ్యాధులకు కారణమైన పొగాకు, గుట్కా, ఖైనీ వంటి మత్తుపదార్థాల నుండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేలా ప్రతి ఒక్కరిని చైతన్యవంతులను చేయాలని జిల్లా కలెక్టర్ యస్ డిల్లీరావు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముద్రించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు వినియోగంతో ఊపిరితిత్తులు దెబ్బతినడమే కాకుండా క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడి ప్రాణాలు కొల్పోయే ప్రమాదం ఉందన్నారు. పొగాకు ఉత్పత్తులను వినియోగించేవారిలో ఆవయువాలు పాడ్కె ప్రతి రోజు దేశవ్యాప్తంగా సగటున 3,500కు పైగా మరణాలు సంభవిస్తున్నా యన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరపకూడదనే నిబంధనను జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువతీ యువకులు పొగాకు ఉత్పత్తుల వినియోగ వ్యామోహంలో పడకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి అలవాట్లను గమనించాలని సూచించారు. పిల్లలు పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు అనుమానం వస్తే వారికి పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలన్నారు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థల ద్వారా కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థ ల్లో పొగాకు దుష్ఫలితాల అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పొగాకు వినియోగం, ధూమపానం అలవాటు ఉన్న వారితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా వ్యాధుల బారిన పడతున్నారన్నారు. పొగాకు వలన కలిగే దుష్ఫలితా లను ప్రజలకు ముఖ్యంగా యువతకు వివరించి అలవాట్లకు దూరంగా ఉంచాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. పొగా కు ఉత్పత్తుల అలవాటు పడిన వారు మానుకునేందుకు జిల్లా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య, కేంద్రాల్లో కౌన్సిలర్స్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కోట్పాయాక్ట్ జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్థానికంగా పొగాకు నిషేద ఉత్పత్తుల అమ్మకాలు జిల్లాలో జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ ౖటట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ జోష్ ఆకృత్, శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళ కళాశాల విద్యార్థులు జి. స్నేహ, యం. సుధీష్న, జి.తన్యశ్రీ అన్ను వర్మ, పాల్గొన్నారు.

## సజావుగా పెన్షన్ల పంపిణీకి పటిష్ట చర్యలు

**– అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**– జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు**



**విజయవాడ,మే31 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని పాటిస్తూ సామాజిక భద్రతా పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకోవాలని.. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు.జూన్ 1వ తేదీ శనివారం నుంచి చేపట్టాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీపై క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశనం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు శుక్రవారం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాలవారీగా పెన్షన్ల సంఖ్య, డీబీటీ మొత్తం, డోర్ టు డోర్ పంపిణీకి బ్యాంకుల నుంచి డ్రా చేయాల్సిన నగదుబీ గ్రామ, వార్డు స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు తదితరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, డప్పు కళాకారులు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర కేటగిరీలకు చెందిన 2,36,726 పెన్షన్లలో 1,80,216 పెన్షన్ల మొత్తాన్ని డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని.. అదే విధంగా 56,510 పెన్షన్లను లబ్ధిదారులకు డోర్ టు డోర్ విధానంలో ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్నవారికి, మంచం లేదా వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారికి, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి వద్దనే పెన్షన్లు నగదు రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు ఖాతాల్లో వివిధ కారణాల వల్ల నగదు జమకాని వారి జాబితాలు కూడా అందుబాటులో ఉన్నాయని వారికి కూడా ఇంటివద్దే పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. జూన్ 1న డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమచేసేందుకు, డోర్ టు డోర్ పంపిణీని జూన్ 3లోగా పూర్తిచేసేందుకు కృషిచేయాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. మే నెలలో బ్యాంకింగ్ బిజినెస్ కరస్పాండెంట్ల కీలక భాగస్వామ్యం వల్ల జిల్లాలో పెన్షన్ల పంపిణీ విజయవంతంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగిందని.. ఈసారి కూడా అదేవిధమైన కార్యాచరణను అనుసరించాల ని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి పాలనలో గత ఐదు సంవత్సరాలుగా మోసాలకు గురైన రాష్ట్ర రైతాంగం

**గద్దె ప్రసాద్**



**విజయవాడ,మే31 (ఆంధ్రపత్రిక):** జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గద్దె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని శ్రీశైలం, పులిచింతల, నాగార్జునసాగర్ రిజర్వాయర్లు వాటర్ మేనేజ్మెంట్ లేక నీరు అడుగంటి పోయిందని, కృష్ణ, పులిచింతలో సాగు, తాగునీరు లేదని, పట్టిసీమను జగన్ రెడ్డి భ్రష్టు పండించాడు అన్నారు. కృష్ణా డెల్టాకి తాగు సాగునీరు అందించే పట్టిసీమ నుండి నీరు అందించకుండా జగన్ రెడ్డి రైతులను నిండా మోసం చేశాడు అన్నారు. రైతుల పక్షపాతి అని ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చే జగన్ రెడ్డి రైతుల కడుపు కొట్టాడు అన్నారు. రాష్ట్రంలోని కరువు మండలాలు ఎన్నో కూడా తెలియని ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి పాలన సాగింది అన్నారు. కనీసం కేంద్రం నుండి వచ్చే ఆర్థిక సహాయంతోనైనా కరువు మండలాల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవచ్చుని, అది కూడా చేయలేని చేతకాని ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయా డన్నారు. ఉద్యానవనం పంటలు, ఆక్వా సాగును నుండి కూడా ఫల సహాయం, మార్కెటింగ్ విధానం పై చర్యలు తీసుకోకుండా, ఎంతసేపు రాజ కీయ దాడులు, కక్ష సాధింపు చర్యలపై దృష్టి పెట్టి జగన్ రెడ్డి రాష్ట్రంలోని రైతాంగాన్ని గాలికి వదిలేసాడు అన్నారు. వరదలకు కొట్టుకుపోయిన ప్రాజెక్టు గేట్లు కూడా కట్టలేని అసమర్ధ ముఖ్యమంత్రి, ప్రభుత్వం గత 5 సంవత్సరాలుగా ప్రాజెక్టులు కడతామని రైతులను, ప్రజలను మోసం చేస్తూనే వచ్చాడు అన్నారు.అనిల్ కుమార్ యాదవ్, అంబటి రాంబాబులు లాంటి మంత్రులు వారి శాఖ కూడా చెప్పలేని అసమర్ధ, చేతకాని మంత్రులను పెట్టుకొని జగన్ రెడ్డి పాలన సాగించాడని, ఆంధ్రప్రదేశ్‌కి జీవనాడి అయిన పోలవరం లాంటి భారీ ప్రాజెక్టులను ఇటువంటి దద్దమ్మల చేతుల్లో పెట్టి,గత చంద్రబాబు హయాంలో 73% పూర్తయిన పోలవరం ప్రాజెక్టును, గత ఐదు సంవత్స రాలుగా జగన్ రెడ్డి అదనంగా రెండు శాతం కూడా పూర్తి చేయలేకపోయాడు అన్నారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపిణీ చేయలేని చేతకాని ప్రభుత్వం జగన్ రెడ్డి ప్రభుత్వం అన్నారు. రాబోయేది ఎన్డీయే కూటమి ప్రభుత్వం అని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని,పోలవరాన్ని 73% నుండి 100% పూర్తిచేసి రాష్ట్రంలోని రైతాంగానికి, ప్రజలకు సాగు తాగునీరు అందించే బాధ్యత చంద్రబాబుకు తీసుకుంటారు అన్నారు.రాష్ట్రంలో మరుగున పడిన ప్రాజెక్టులన్నిటికీ జీవం పోసే బాధ్యత చంద్రబాబుది అని,రాష్ట్రంలోని రైతాంగం బాగుండాలంటే అది చంద్రబాబు పాలనలోనే సాధ్యం అన్నారు.

## పుస్తక పఠనంతో ఉత్తమ విద్యార్థులుగా రాణిస్తారు



**పోరుమామిళ్ల, మే 31 (ఆంధ్రపత్రిక):** విద్యార్థులు వేసవి సెలవులలో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివితే ఉత్తమ విద్యార్థులుగా రాణిస్తారని విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మార్కారెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్ అన్నారు. పోరుమామిళ్లలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని డాక్టర్ మార్కా రెడ్డి శుక్రవారం పరిశీలించారు. జనరల్ నాలెడ్జ్ పై ప్రశ్నలు అడిగి విద్యార్థులనుండి సమాధానాలు రాబట్టారు.విద్యార్థులచే వారు చదివిన కథలను చెప్పించారు. వివిధ శతక పద్యాలను వారిచే చెప్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ మార్కారెడ్డి,దాదా పీర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో వీధులలో తిరుగుతూ సమయం వృధా చేసుకోకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవడం వలన విజ్ఞానవంతులు అవుతారన్నారు. శుక్రవారం గ్రంథాలయానికి సెలవు రోజైనా గ్రంథాలయాన్ని విద్యార్థుల కోసం తెరచిఉంచిన ఆఫ్రిదిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీర్ భాష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోనీ ఇండియా నుంచి నూతన సిరీస్ వైర్‌లెస్ మైక్రోఫోన్లు




**విజయవాడ,మే31 (ఆంధ్రపత్రిక):** తమ మైక్రోఫోన్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ, సోనీ ఇండియా ఈసీఎం-డబ్లు3, ఈసీఎం-డబ్లు3ఎస్ వైర్‌లెస్ మైక్రోఫోన్‌లను విడుదల చేసింది. ఈ అత్యాధునిక మైక్రోఫోన్‌లు తేలికపాటి డిజైన్‌తో అధిక నాణ్యత గల సౌండ్ క్యాప్చర్‌ను మిళితం చేస్తాయి. ఈసీఎం-డబ్లు3, ఈసీఎం-డబ్లు3ఎస్ మోడల్‌లతో, వివిధ షూటింగ్ దృశ్యాలలో అత్యుత్తమ ఆడియో రికార్డింగ్‌ను సాధించగల సామర్థ్యంతో సోనీ వీడియో కంటెంట్ సృష్టికర్తలకు మెరుగైన అవకాశాలని ఇస్తుంది. ఈసీఎం-డబ్లు3 రెండు ఛానల్ రిసీవర్, రెండు మైక్రోఫోన్‌లను కలిగి ఉంది. ఈసీఎం-డబ్లు3ఎస్ ఒక ఛానల్ రిసీవర్, ఒక మైక్రోఫోన్‌ను కలిగి ఉంది.

## కూటమి గెలుపుతో రాష్ట్రానికి స్వర్ణ యుగం

**బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అత్యధిక భారీ మెజారిటీతో గెలుపు ఖాయం**

**గాండ్ల,తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు**



**శ్రీకాళహస్తి, మే 31 (ఆంధ్ర పత్రిక):** ఈనెల 13వ తారీఖున జరిగిన సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో ఎన్డీఏ కూటమి విజయ దుందుభి మోగించడం ఖాయమని గాండ్ల,తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు పత్రికా ముఖంగా శుక్రవారం తెలిపారు.ఈ యొక్క వైయస్సార్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజున ప్రజా వేదిక కూల్చివేతతో మొదలుకొని ఇప్పటివరకు రాష్ట్రంలో ఎటువంటి పురోగతి కనబడలేదని అధికార పార్టీ ఎన్ని కుయుక్తులు పన్నినా కూటమి విజయాన్ని ఎవ్వరూ కూడా అడ్డుకోలేరన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజ్ఞతతో అలోచించి ఓటు వేసిన ప్రతీ ఒక్కరికీ ధన్య వాదాలు తెలుపుతూ జూన్ 4 వ తారీఖున విడుదల కాబోయే ఎన్నికల ఫలితాల్లో టిడిపి,బిజెపి,జనసేన మిత్ర పక్షాల కూటమి 130 నుంచి 140 దాకా అసెంబ్లీ స్థానాలు, 18 నుంచి 22 పార్లమెంటు స్థానాలు కైవసం చేసుకుంటుందని మళ్ళీ 4 వ సారి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమణస్వీకారం చేస్తున్నారని తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం స్వర్ణ యుగం వైపు అడుగులు వేస్తుందని అలాగే శ్రీ కాళహస్తి ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బలపరిచిన కీర్తి శేషులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి 25 వేల పై చిలుకు మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## జాతీయ పొగాకు నివారణోత్సవ కార్యక్రమం



**సోమల, మే 31 (ఆంధ్ర పత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజక వర్గం సోమల మండలం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం జాతీయ పొగాకు నివారణోత్సవం సందర్భంగా వైద్యాధి కారుల సిబ్బంది అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను సేవించడం వల్ల కలుగు లాభనష్టాలను కూలంకషంగా వివరించారు .ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులు నునమిలిన వారికి నోటి క్యాన్సరు, లంగ్ క్యాన్సర్ వంటి శ్వాస కోస సంబంధమైన వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. ప్రభుత్వము వారు ఎన్ని చర్యలు తీసుకున్న పొగాకు సేవించే వారి సంఖ్య అధికంగా ఉన్నదని తెలియజేశారు. ఈ క్రమంలో ప్రజలు భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని పొగాకు ఉత్పత్తులను సేవించడం మానివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగయ్య అమర్నాథ్ ఉపాధి హామీ జూనియర్ ఇంజినీర్ రెడ్డప్ప గీత తదితరులు పాల్గొన్నారు.

## సీతాదేవి చిత్రపటానికి నివాళులర్పించి నెట్టెం రఘురామ్



**కలిదిండి, మే31 (ఆంధ్రపత్రిక):** కృష్ణాజిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం కోడూరు గ్రామంలో ఇటీవల పరమపధించిన మాజీ మంత్రి,యెర్నేని సీతాదేవి స్వగృహంలో వారి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ఈ సందర్భంగా రఘురామ్ సీతాదేవి కుటుంబంతో ఎంతో అనుబంధం ఉన్నదని ఎన్టీఆర్ మంత్రి మండలి లో విద్యాశాఖ మంత్రిగా ఎంతో సమర్థవంతంగా పని చేశారని విజయ డైరీ డైరెక్టర్‌గా రైతులకు మెరుగైన ఆదాయం వచ్చే విధంగా సీతాదేవి అండగా నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేసుకుని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని వేడుకున్నారు.

# మచిలీపట్నంలో తొలిసారిగా పీవీఆర్ ఐనాక్స్

**నగరంలో తొలి మల్టీప్లెక్స్ ప్రారంభం**

**ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త**

**3 స్క్రీన్ల మల్టీప్లెక్స్ ఏర్పాటు**






**మచిలీపట్నం, మే31 (ఆంధ్రపత్రిక):** భారతదేశంలో అతి పెద్ద, అత్యంత ప్రీమియం సినిమా ఎగ్జిబిటర్ అయిన పీవీఆర్ ఐనాక్స్ ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం నగరంలో గల వరం సెంట్రల్ మాల్‌లో తమ మొట్టమొదటి మల్టీప్లెక్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. 872 మంది ప్రేక్షకులు పట్టే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్ పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్ వారు విలీనం అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేస్తున్న మొట్టమొదటిది కావడం విశేషం.ఈ కొత్త మల్టీప్లెక్స్‌లో అధునాతన 3డి ఫ్రీడో లైట్ టెక్నాలజీతో పాటు విలాసవంతమైన, సౌకర్యవంతమైన స్లైడర్లు, ఇంకా ఆప్టిమైజ్డ్ కంఫర్ట్ కోసం రెక్లైనర్ కుర్చీలు ఉన్నాయి. డాల్బీ ఏటీఎంఓఎస్ ఆడియో, 2కే ప్రొజెక్టర్ల వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన ఆడియో అనుభవం కూడా ఇక్కడ ఉంటుంది. నిజంగా అద్భుతమైన సినిమా అనుభవాన్ని అందించడానికి నెక్ట్స్ జనరేషన్ 3డి స్క్రీన్స్ ఈ థియేటర్‌లో ఉన్న మరో హైలైట్. మచిలీపట్నంలో కొత్త మల్టీప్లెక్స్ ఏర్పాటు గురించి ప్రకటిస్తూ పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ అజయ్ బిజిలీ ఇలా అన్నారు.. “మత్స్యకార పట్టణమైన మచిలీపట్నం ఒక చైతన్యవంతమైన, సాంస్కృతికంగా సుసంపన్నమైన నగరం. ఇది చేనేత పరిశ్రమ, కూచిపూడి శాస్త్రీయ నృత్య రూపానికి ప్రసిద్ధి చెందింది. మచిలీపట్నం నగరంలో మొదటి మల్టీప్లెక్స్ ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో మా ఉనికిని మరింత బలోపేతం చేయడం సంతోషంగా ఉంది. సౌకర్యవంతంగా ఉన్న ఈ కొత్త థియేటరల్ వల్ల.. విజయవాడకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అంతర్జాతీయ స్థాయి సినిమా అనుభవాన్ని ఈ ప్రాంత వాసులకు అందిస్తుంది. దక్షిణ భారతదేశంలో సినిమా వినియోగం బాగా ఎక్కువగా ఉన్నందున, కొత్త 3-స్క్రీన్ల మల్టీప్లెక్స్ ప్రారంభం ద్వితీయ, తృతీయ శ్రేణి మార్కెట్లలో వృద్ధిని వేగవంతం చేయాలనే మా విజన్‌కు అనుగుణంగా ఉంటుంది. స్థానిక డిమాండ్ ను తీర్చడం ద్వారా, అధునాతన వినోద సౌకర్యాలను అందించడం ద్వారా, సాంస్కృతిక భూభాగాన్ని సుసంపన్నం చేయడం, మచిలీపట్నం నగర ఆర్థిక అభివృద్ధికి దోహదం చేయడం మా లక్ష్యం” అని చెప్పారు. ఈ థియేటర్ ఇంటీరియర్స్ కూడా ఇందులో ప్రదర్శించే సినిమాల్లో మాదిరిగానే క్లాసీగా, ఆకర్షణీయంగా ఉంటాయి. దాని సౌందర్యం, వాతావరణాన్ని సెట్ చేసిన విధానంలో దాని అధునాతన, నిశ్శబ్ద సొగసును చూడవచ్చు. అన్ని ఆడిటోరియంలు వేర్వేరు రంగుల్లో ఉండే థీమ్‌ను అనుసరిస్తూ థియేటర్‌కు బ్రహ్మాండమైన డెప్త్‌ను అందిస్తాయి. “మచిలీపట్నం నగరంలోని మొట్టమొదటి మూడు స్క్రీన్ల మల్టీప్లెక్స్ ను వరం సెంట్రల్ మాల్ లో ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. ఒక సరికొత్త వినోద ల్యాండ్ మార్క్‌తో ఒకేచోట వేర్వేరు సినిమాలను అందించే నిజమైన బిగ్ స్క్రీన్ ప్రభావం ఈ నగరంలోని వివేకవంతులైన ప్రేక్షకులకు అందుతుంది. ఈ మల్టీప్లెక్స్ అత్యంత సమకాలీన, ఆలోచనాత్మక, బాగా నిర్ణయించిన సినిమా అనుభవానికి నిజమైన చిహ్నంగా ఉంటుంది. పీవీఆర్ ఐనాక్స్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచ స్థాయి వాతావరణం, విలాసవంతమైన సౌకర్యం, ఉత్తేజకరమైన శ్రేణి ఆహార పానీయాలతో మార్కెట్లలో వినోదానికి విస్తృత అందుబాటుకు మేము మార్గం సుగమం చేస్తున్నాము” అని పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ సంజీవ్ కుమార్ బిజిలీ తెలిపారు.

## రాష్ట్ర ప్రింటింగ్,స్టేషనరీ డిజిగా ఏబీ వెంకటేశ్వరరావు



**విజయవాడ,మే31 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రింటింగ్,స్టేషనరీ డిజిగా పదవి భాధ్యతలు చెప్పట్టడానికి వెళ్తున్న ఏబీ వెంకటేశ్వరరావుని పడమట లోని ఆయన నివాసంలో కలిసి గజమాల వేసి అభినందనలు తెలియజేసిన మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఆరేటి ప్రకాష్,తెలుగుదేశం పార్టీ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ నేలిబండ్ల బాలస్వామి,మాజీ కార్పొరేటర్ నరసింహ చౌదరి,డాక్టర్.సంకే విశ్వనాథం,ఎం. అబిద్ హుస్సేన్‌లు.

# ఐదేళ్ల న్యాయ పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా ఆయనను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్ట్ ఉత్తర్వులు మేరకు శుక్రవారం ఉదయం వెంకటేశ్వర రావుపై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు మొదటిసారి సస్పెన్షన్ ఎత్తివేసి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అప్పుడు కూడా ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా పోస్టింగ్ ఇచ్చింది. మళ్ళీ ఇప్పుడు కూడా అదే పోస్టింగ్ ఇచ్చింది.ఈ క్రమంలో ఏబీ వెంకటేశ్వరరావు ఛార్జ్ తీసుకున్నారు. తిరిగి సాయంత్రం పదవీ విరమణ చేయనున్నారు. ఐదేళ్ల క్రితం జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చీ రాగానే.. ఏబీ వెంకటేశ్వరరావుపై ప్రభుత్వం కక్ష గట్టింది. ఆ వెంటనే ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. అప్పుడు వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తి వేయాలంటే ఏపీ ప్రభుత్వానికి క్యాట్ సూచించింది. దీనిపై జగన్ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అయితే క్యాట్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోబోమని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అలా ఐదేళ్లుగా ఏబీ వెంకటేశ్వరరావు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. ఆయన పోరాటం ఫలించి.. పదవీ విరమణ రోజు విధుల్లో చేరారు. ఈ క్రమంలో జగన్ జగన్ సర్కార్ అనుకున్న విధంగానే ఐదేళ్లు ఆయనను అధికారానికి దూరంగా ఉంచారు. చివరకు పదవీవిరమణ రోజు హైకోర్టులో కూడా వ్యతిరేకంగా నిర్ణయం రావడంతో సర్వీసులోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఏబీవీపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఇటీవల కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఎత్తివేసింది. దీనిని హైకోర్టు కూడా సమర్థించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను సర్వీసులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమిషనర్ ఆయనకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# వైసిపి గెలిచే అవకాశాలు లేవు..!

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అయితే రాష్ట్ర చిహ్నం మార్చక పోవడమే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర చిహ్నం జోలికి వెళ్లకుండా.. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర గీతం కంపోజ్ చేయానికి కీరవాణిని మ్యూజిక్ డైరెక్టర్‌గా పెడితే తప్పేంటని ప్రశ్నించారు. కళలకు ప్రాంతీయ భేదాలు ఉండవని.. హద్దులు గీయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ధ్యానం చేయడమంటే కన్యాకుమారిని కలుషితం చేయడమే అని విమర్శించారు.ఏపీ పాలిటిక్స్‌పై కూడా సీపీఐ నారాయణ స్పందించారు. ఏపీలో వైసీపీ గెలిచే అవకాశాలు లేవని జోస్యం చెప్పారు. కావాలనే విశాఖలో ప్రమాణస్వీకారం అంటూ వైసీపీ నేతలు హడావుడి చేస్తున్నారని అన్నారు. కౌంటింగ్ గురించి కూడా వైసీపీ నేతలు రెచ్చగట్టే మాటలు మాట్లాడుతున్నారని.. దాన్ని బట్టే వైసీపీ ఓడిపోతుందని తెలుస్తోందని తెలిపారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలోకి రాకపోతే టీడీపీ అధినేత చంద్రబాబు ఇండియా కూటమితో జత కట్టాలని కోరుకుంటున్నా అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలు ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

బిట్ర శివన్నారాయణ, పాతూరి నాగభూషణం ఉన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో 11 మంది నేతల బృందం శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కలిసింది. 13 అంశాలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆర్‌బీఐ జాబితా ప్రకారం తెచ్చిన మొత్తం అప్పులు, గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలు, రాష్ట్ర ప్రభుత్వం తాకట్టు పెట్టిన ఆస్తుల వివరాలు ప్రకటించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గవర్నర్‌తో భేటీ అనంతరం పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. 'వైకాపా ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అడ్డగోలుగా అప్పులు తెచ్చింది. గ్రామాల్లో పనులు చేసిన సర్పంచ్‌లు, గుత్తేదారులకు బిల్లులు కూడా ఇవ్వలేదు. కేంద్రం గ్రామీణాభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించారు. మద్యంపై భవిష్యత్‌లో వచ్చే ఆదాయాన్ని కూడా చూపి అప్పులు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ అడిగే హక్కు గవర్నర్‌కు ఉంది. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుల వివరాలు కావాలని కోరాం. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా నచ్చిన వచ్చిన వారికి ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లించారని పురందేశ్వరి ఆరోపించారు.

# సజ్జల వ్యాఖ్యలు దారుణం

(మొదటిపేజీ తరువాయి)

కేసు నమోదైంది. కౌంటింగ్ ఏజెంట్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో తెదేపా నేతలు దేవినేని ఉమా, గూడపాటి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఆయనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. 153, 505, 125 సెక్షన్ల కింద సజ్జలపై కేసు పెట్టారు. వైకాపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ చీఫ్ కౌంటింగ్ ఏజెంట్ల అవగాహన సదస్సులో సజ్జల పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'మన టార్గెట్ ఇదీ అని దృష్టిలో పెట్టుకుని... దానికి అవసరమైనవి తెలుసుకోవాలి. అవతలివారు అడ్డం పడకుండా వారిని ఆపేందుకు ఏవేం నిబంధనలు ఉన్నాయో చూసుకోవాలి. మనవి ఒక్క ఓటు కూడా చెల్లనివిగా చేసే పరిస్థితి రాకుండా అడ్డుకునేందుకు ఏం చేయాలో చూసుకోవాలి. అంతే తప్ప రూల్ అలా ఉంది కాబట్టి దాని ప్రకారం పోదాం అని మనం కూర్చోకూడదు. మనకు అనుకూలంగా, అవతలివాళ్ల ఆటలు సాగకుండా రూల్‌ని ఎలా చూసుకోవాలి? అవసరమైతే దానికోసం ఎంతవరకు ఫైట్ చేయాలనేది నేర్చుకుందాం. ఇందులో కౌంటింగ్ ఏజెంట్ తనవంతు పాత్ర పోషించేలా వారి మెదడులోకి మీరు (చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు) బాగా ఎక్కించాలి. పొరపాటున ఒకటి మనం వాదించినా పర్లేదు. కానీ, రూల్ కాదేమో అని వెనక్కి తగ్గేవాడైతే ఏజెంట్‌గా వద్దు' అని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపై తెదేపా నేతలు ఫిర్యాదు చేయడంతో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న అమిత్ షా దంపతులు..

**తిరుమల,మే 31 (ఆంధ్రపత్రిక):** మరో నాలుగు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలోనే రాజకీయ ప్రముఖులంతా దైవ దర్శనం చేసుకుంటున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. తన సతీమణి సోనాల్ షాతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. మహాద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించిన అమిత్ షా దంపతులు.. శ్రీవారి అభిషేకసేవలో పాల్గొన్నారు. అమిత్ షా దంపతులకు ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గత కొద్ది రోజులుగా అమిత్ షా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కశ్మీర్ నుంచి తమిళనాడు వరకూ పర్యటించిన ఆయన ఎన్నికల ప్రచారం ముగియడంతో తిరుమల శ్రీవారి సన్నిధిలో గడపాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల తుది విడత ప్రచారం ముగియడంతో గురువారం సాయంత్రం 6.15 గంటలకు అమిత్ షా దంపతులు రేణిగుంటకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమలకు చేరుకున్నారు. రాత్రికి వకుళామాత అతిథిగృహంలో బస చేశారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించున్నారు. మధ్యాహ్నం తిరుమల నుంచి తిరిగి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఎన్నికల ఫలితాలకు ముందు అమిత్ షా శ్రీవారిని దర్శించుకోవటానికి రావటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇంగ్లండ్ నుంచి బంగారం తరలింపు

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఈ స్థాయిలో బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. అప్పట్లో ఆర్థిక సంక్షోభం కారణంగా భారత్ పెద్దఎత్తున పసిడి నిల్వలను తనఖా పెట్టాల్సివచ్చింది. రవాణా, నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్ ఇంతమొత్తం బంగారాన్ని తీసుకొచ్చింది. దేశీయంగా ముంబయి మింట్ రోడ్డు సహా నాగ్‌పూర్‌లోని పాత కార్యాలయాల్లో ఆర్‌బీఐ పుత్తడిని నిల్వ చేస్తుంటుంది. కొన్నేళ్లుగా కేంద్ర రిజర్వ్ బ్యాంకు పెద్దఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తూ వస్తోంది. దీన్ని ఎక్కడ నిల్వ చేయాలనేది ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో విదేశాల్లోని మన నిల్వలు గణనీయంగా పెరిగాయి. దీంతో కొంత మొత్తాన్ని భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. చాలా దేశాల కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. అదే బాటలో భారత్ సైతం అక్కడి డిపాజిటరీల్లో పెద్దఎత్తున పసిడిని నిల్వ చేస్తూ వచ్చింది. 2024 మార్చి ముగిసేనాటికి ఆర్‌బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. దీంట్లో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వ చేసి ఉంచింది. ఇటీవల కొన్నేళ్లుగా వరుసగా కొనుగోలు చేస్తూ వచ్చిన ఆర్‌బిఐ గత ఏడాది 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వల్లో చేర్చింది. ఈ ఏడాది కొనుగోళ్ల జోరు మరింత పెరిగింది. జనవరి–ఏప్రిల్ వ్యవధిలోనే 2023 మొత్తం కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారం కొనుగోలు చేయడం గమనార్హం. రవాణా, భద్రత విషయాలను పరిగణనలోకి తీసుకుంటే 100 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించడం మామూలు విషయం కాదు. దీనివెనక కొన్ని నెలల కసరత్తు అవసరం. ఆర్‌బీఐ, ఆర్థికశాఖ సహా వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక యంత్రాంగం మధ్య సమగ్ర సమన్వయం ఉండాలి. ఈ బంగారాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు తొలుత ఆర్థికశాఖ నుంచి ఆర్‌బీఐ కస్టమ్స్ సుంకం మినహాయింపు తీసుకుంది. సాధారణంగా అన్ని దిగుమతులపై వర్తించే ఐజీఎస్టీ మాత్రం తప్పలేదు.

మలద్వారంలో బంగారం దాచి..

# అధికారులకు పట్టుబడ్డ ఎయిర్ హోస్టెస్

**న్యూఢిల్లీ,మే 31 :** బంగారం స్మగ్లింగ్ చేస్తూ ఓ ఎయిర్‌హోస్టెస్ అధికారుల ముందు అడ్డంగా దొరికిపోయింది. సుమారు కేజీ బంగారాన్ని మలద్వారం భాగాల్లో దాచుకుని తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించి అరెస్ట్ చేశారు. డీఆర్‌ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితురాలు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందని ఎయిర్‌హోస్టెస్ సురభి ఖాతున్‌గా గుర్తించారు. మే 28న మస్కట్ నుంచి కేరళ కన్నూర్‌కు వచ్చిన విమానంలో ఆమె క్రూ సిబ్బందిగా ఉన్నారు. విమానం కన్నూర్ చేరుకోగానే.. అధికారుల తనిఖీల్లో ఎయిర్‌హోస్టెస్ బండారం బయట పడింది. ఆమె మలద్వారంలో సుమారు 960 గ్రాముల బంగారాన్ని దాచిపెట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

# ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని ప్రకటించారు. ఈ క్రమంలో ఇటీవలి ఎన్నికల హింస నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఓట్ల లెక్కింపు పక్రియ జూన్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఉదయం 4 గంటలకల్లా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత 5 గంటలకు వారికి ఏయే టేబుళ్లు కేటాయించారన్న సమాచారం అందిస్తారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుండగా.... తొలుత ఆర్మీ సర్వీస్ ఉద్యోగుల ఓట్లు ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించనున్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి అరగంట సమయం పట్టనుంది. ఆ తర్వాత ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ను తెరిచి ఓట్లు లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లను సిద్ధం చేశారు. పోలింగ్ బూత్ సీరియల్ నెంబర్లు ఆధారంగా వరుస క్రమంలో ఈవీఎంలు తెరిచి ఓట్లు లెక్కించనున్నారు. అంటే 14 టేబుళ్లపై తొలుత 1 నుంచి 14 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలు తెచ్చి పెట్టనున్నారు. అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలో వాటిని తెరిచి లెక్కించనున్నారు. దీంతో తొలి రౌండ్ పూర్తవుతుంద న్నమాట... ఆ తర్వాత రెండో రౌండ్‌లో 15 నుంచి 29 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలు తెచ్చి పెట్టనున్నారు.ఈ విధంగా ఒక్కో రౌండ్ పూర్తి చేసుకుంటూ వెళ్లనున్నారు. ఏదైనా ఈవీఎంలో సమస్య తలెత్తినప్పుడు ఆ పోలింగ్ బూత్ ఈవీఎం పక్కనపెట్టి ఆ తర్వాత వరుస సంఖ్యలో ఉన్న బూత్ నుంచి లెక్కించుకుంటూ వెళ్తారు. పక్కన పెట్టేసిన ఈవీఎంను చివరిలో మరోసారి చెక్ చేయనున్నారు. అప్పటికీ వీలుకాకుంటే ఆ పోలింగ్ బూత్‌లోని వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించి వాటినే ఓట్లుగా పరిగణించనున్నారు. అలాగే ఈవీఎంల లెక్కింపు పూర్తయినా తుది ఫలితాలు ప్రకటించరు. పోలింగ్ బూత్‌ల సీరియల్ నెంబర్లన్నీ చిట్‌లపై రాసి ఓ బాక్స్‌లో వేయనున్నారు. లాటరీ ద్వారా ఐదు పోలింగ్ కేంద్రాలను ఎన్నుకుని వాటి వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించనున్నారు. ఈవీఎంల్లో వచ్చిన ఓట్లకు, వీవీప్యాట్ ఓట్లకు సరిపోలితే సరి లేకుంటే మూడుసార్లు లెక్కించనున్నారు. ఈ మూడుసార్లు కూడా రెండు ఫలితాలు సరిపోకపోతే....వీవీపీ ప్యాట్ స్లిప్‌లనే అసలైన ఓట్లుగా భావించి వాటినే పరిగణలోకి తీసుకోనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లో అత్యధికంగా 111 నియోజకవర్గాల్లో 20కంటే తక్కువ రౌండ్లలోనే లెక్కింపు పూర్తికానుంది. ఈ నియోజకవర్గాల ఫలితాలను మధ్యాహ్నం 2 గంటల్లోగా పూర్తిచేయనున్నారు. మరో 60 నియోజకవర్గాల్లో 21 నుంచి 25 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఫలితాలు సాయంత్రానికి అందుబాటులోకి రానున్నాయి. మరో 4 నియోజకవర్గాలు మాత్రమే రాత్రి వరకు లెక్కింపు సాగనుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి 9 గంటల కల్లా మొత్తం పక్రియ ముగించేలా ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఉదయం 11 గంటల కల్లా ఫలితాల ట్రెండ్ వెలువడే అవకాశం ఉంది. అయితే తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురంలో వెలువడనుంది. ఎందుకంటే ఈ రెండు నియోజకవర్గాల్లో కేవలం 13 రౌండ్లు మాత్రమే ఉన్నాయి. కాబట్టి అన్నిటికన్నా ముందు ఈ రెండు నియోజకవర్గాల ఫలితాలు వెలువడనున్నాయి. ఒక్కో రౌండు పూర్తవడానికి గరిష్ఠంగా 20 నిమిషాల నుంచి 30 నిమిషాల లోపు మాత్రమే పట్టే అవకాశం ఉంది. కాబట్టి..ఈ రెండు ఫలితాలు త్వరగా వచ్చే అవకాశం ఉంది. రంపచోడవరం, చంద్రగిరి నియోజకవర్గాల్లో మొత్తం 29 రౌండ్లలో ఓట్లు లెక్కించాల్సి ఉన్నందున...అన్నింటికన్నా చివర ఈ రెండు నియోజకవర్గాల ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అలాగే భీమిలి, పాణ్యం నియోజకవర్గాల ఫలితా కోసం కూడా రాత్రి వరకు వేచి చూడాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా 25 రౌండ్లు చొప్పున ఓట్లు లెక్కించాల్సి ఉంటుంది.

# మళ్లీ జైలుకు వెళుతున్నా..

- నేటితో ముగియనున్న కేజ్రీవాల్ బెయిల్
- వీడియో విడుదల చేసిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,మే 31 :** ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఓ వీడియో రిలీజ్‌చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్ మీద బయటకు వచ్చిన ఆయన.. జూన్ రెండో తేదీన సరెండర్ కానున్నట్లు చెప్పారు. మళ్లీ తీహార్ జైలుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌తో లింకున్న మనీ ల్యాండరింగ్ కేసులో కేజ్రీని ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ తరపున ప్రచారం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ పెట్టుకున్నారు. ఆయనకు 21 రోజుల తాత్కాలిక బెయిల్‌ను సుప్రీం జారీ చేసింది. ఆ బెయిల్ గడువు జూన్ ఒకటో తేదీతో ముగియనున్నది. బెయిల్‌ను పొడిగించాలని పెట్టుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ స్వీకరించలేదు. దీంతో దారులు మూసుకుపోయాయి. దేశాన్ని నియంతృత్వం నుంచి రక్షించేందుకు మళ్లీ జైలుకు వెళ్లనున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. మళ్లీ జైలుకు వెళ్తే తనను ఎన్ని రోజులు బంధిస్తారో తెలియదన్నారు. జైలులో ఉన్నప్పుడు తనను ఎన్నో విధాలుగా వేధించినట్లు ఆరోపించారు. తనకు మెడిసిన్ ఇవ్వడం ఆపేశారన్నారు. జైలుకు వెళ్లేముందు తన బరువు 70



కేజీలు అని, ఇప్పుడు 64 కేజీలకు చేరుకున్నట్లు వెల్లడించాడు. జైలు నుంచి రిలీజైన తర్వాత కూడా ఇంకా బరువు పెరగలేదన్నాడు. తమ సర్కారు అమలు చేస్తున్న అన్ని స్కీమ్‌లు యథాతథంగా ఉంటాయని, మళ్లీ వచ్చిన తర్వాత ప్రతి మహిళకు వెయ్యి ఇస్తానన్నారు.

# నేడు చివరిదశ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

హిమాచల్ ప్రదేశ్ లో నాలుగు స్థానాలకు, ఉత్తర్ ప్రదేశ్ లోని 13 నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ లోని తొమ్మిది స్థానాలకు, బీహార్ లోని ఎనిమిది స్థానాలకు, ఒడిశాలోని ఆరు స్థానాలకు, ఝార్ఖండ్ లోని మూడు సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈసారి పోటీలో ఉన్న ప్రముఖులలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ, లాలూ ప్రసాద్ కూతురు మిసా భారతి, నటి కంగనా రనౌత్ ఉన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనున్నది.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం టెలివిజన్ ఛానల్స్, వార్తా సంస్థలు జూన్ 1న సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్ డేటాను ప్రదర్శించుకోవచ్చు.

# దేశవ్యాప్తంగా మండుతున్న ఎండలు

- నాగ్‌పూర్‌లో అత్యధికంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు - దేశవ్యాప్తంగా 54మంది మృతి

**నాగ్‌పూర్,మే 31 :** దేశవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మొన్నటికి మొన్న దేశ రాజధాని దిల్లీలో అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఆ ఉష్ణోగ్రతను దాటి ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ లో ఏకంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పూర్‌లో భారత వాతావరణ విభాగం నాలుగు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో రెండింట గురువారం అసాధారణ ఉష్ణోగ్రతలు చూపించాయి. సోనేగావ్‌లోని ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌లో 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. ఉత్తర అంబాజరీ రోడ్డులోని ఐఎండీ కేంద్రంలో రికార్డు స్థాయిలో 56 డిగ్రీలు నమోదైంది. మిగతా రెండు స్టేషన్లలో 44 డిగ్రీల ఎండలు ఉన్నట్లు రికార్డయ్యింది. ఇటీవల దిల్లీలోని ముంగేష్‌పూర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. దిల్లీ చరిత్రలో ఇదే అత్యధికం కావడంతో వాతావరణ శాఖ స్పందిందించి. ఆ వాతావరణ స్టేషన్‌లోని సెన్సార్ సరిగా పనిచేస్తుందో, లేదో తనిఖీ చేస్తున్నట్లు తెలిపింది. ఈ పరిణామాల వేళ ఇప్పుడు నాగ్‌పూర్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడం మరోసారి చర్చకు దారితీసింది. ఇక్కడా సెన్సార్ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది. మరోవైపు తీవ్రమైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పటికే వడదెబ్బ కారణంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా బిహార్‌లో 32 మంది మృతి చెందగా.. ఒడిశాలో 10, ఝార్ఖండ్‌లో 5, రాజస్థాన్‌లో ఐదుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు, దిల్లీలో ఒకరు మరణించారు. రానున్న రెండు రోజుల్లో యూపీ, దిల్లీ, చండీగఢ్, హరియాణాలోని పలు




ప్రాంతాల్లో దుమ్ము తుపాను వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వడగాలులు తీవ్రంగా ఉన్నందున దేశంలో అవకాశాలను పరిశీలించాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచించింది.మరోవైపు, దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం కాస్త ఊరటనిచ్చే విషయం. గురువారం కేరళ తీరాన్ని తాకిన ఈ రుతుపవనాలు.. ప్రస్తుతం దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇవి మిగతా ప్రాంతాలకు విస్తరించే అవకాశముంది. దీంతో శనివారం నుంచి వడగాలుల తీవ్రత కాస్త తగ్గొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# ఢిల్లీలో నీటి సంక్షోభం..

**న్యూఢిల్లీ,మే31 :** నీటి కోసం యుద్ధాలు మొదలవుతున్నాయా? భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు తప్పవని చాలా మంది మేధావులు చెప్పారు. ఇప్పటికే ఆఫ్రికాను వాటర్ క్రైసిస్ వెంటాడుతోంది. ఇదంతా ఇప్పట్లో కాదని దేశంలోని పలు ప్రభుత్వాలు లైట్‌గా తీసుకున్నాయి. మేధావులు చేసిన హెచ్చరికలను పెద్దగా పట్టించుకోలేదు. దాని ఫలితమే.. నిన్న కోల్‌కత్తా, బెంగళూరు.. నేడు ఢిల్లీ. ఉత్తరాదిలో ఈసారి ఎండలు ఠాకెత్తించాయి. ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 45 డిగ్రీల పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయంటే పరిస్థితి ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతుంది. రోడ్డు మీదకు ప్రజల రాలేక నానావస్థలు పడ్డారు. ఎండల ప్రభావం నీటిపై పడింది. దేశ రాజధాని ఢిల్లీలో నీటి కొరత తీవ్రమైంది. వీధుల్లోకి వాటర్ ట్యాంకులు వస్తే చాలు నీటి చుక్కను ఒడిసి పట్టుకోవడానికి నానాప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమయంలో ప్రజలు కొట్టుకుంటున్న సందర్భాలు లేక పోలేదు. ప్రస్తుతం ఢిల్లీ అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. పరిస్థితి గమనించిన ఆప్ సర్కార్, నీటి వృధాను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా వాహనాలు కడిగితే భారీ మొత్తం జరిమానా వేసేందుకు వెనుకాడలేదు. నీటిని వాణిజ్యం కోసం ఉపయోగించే ఊరుకునేది లేదని హెచ్చరించింది. ముఖ్యంగా నిర్మాణాలు జరిగే ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు వంటి ప్రాంతాల్లో అక్రమంగా ఉన్న నీటి కనెక్షన్లను నిలిపివేయాలని ఢిల్లీ మంత్రి అధికారులను ఆదేశించారు.

# ధ్యానంతో ప్రజాధనం వృధా

**న్యూఢిల్లీ,మే 31 :** కన్యాకుమారిలోని ధ్యానమందిరంలో జూన్ 1వ తేదీ వరకూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యానంలో కూర్చోనుండటంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం విమర్శలు గుప్పించారు. రాజకీయాలను మతంతో ముడిపెట్టడం సరికాదన్నారు. భగవంతుడి మీద అంతగా విశ్వాసం ఉంటే ఆ ధ్యానం ఏదో ఇంట్లోనే కూర్చుని చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. దీనికి ఇంతగా ప్రచారం చేసుకోవాలా అని మండిపడ్డారు. రాజకీయాలు, మతం రెండింటినీ ఒకే గాట కట్టరాదు. వేర్వేరుగానే వాటిని ఉంచాలి. ఒక మతానికి చెందిన వ్యక్తి మీతో ఉండొచ్చు, మరొకరు మీకు దూరంగా ఉండొచ్చు. మతపరమైన భావోద్వేగాలను ఎన్నికలతో ముడిపెట్టరాదన్నారు. మోదీ కన్యాకుమారి వెళ్లి డ్రామా ఆడబోతున్నారు. ఇందుకోసం భారీగా పోలీసు అధికారులను విధుల్లో ఉంచాల్సి వస్తుంది. తద్వారా ఎంతో ప్రజాధనం వృథా అవుతుంది. మీరు చేసే 'షో' వల్ల దేశానికి కీడు జరుగుతుంది. మీకు భగవంతుడి మీద విశ్వాసం ఉంటే ఆ పనేదే ఉంట్లోనే చేసుకోవచ్చని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ఏమి చెప్పినప్పటికీ దేశ ప్రజలు మాత్రం ఆయన నాయకత్వాన్ని అంగీకరించరాదనే నిర్ణయానికి వచ్చినట్టు ఖర్గే తెలిపారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఈ ఎన్నికల్లో ప్రధానాంశాలుగా ఉన్నాయన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి అంశాలు ప్రజల మనసుల్లో ఉన్నాయి. ఆంధ్రాలో బీజేపీ కొన్ని సీట్లు గెలుచుకోవచ్చు, కానీ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు అడ్వాంటేజ్ ఉంది. యూపీలో కూడా కూటమి కారణంగా మాకు మరిన్ని సీట్లు వస్తాయని ఆయన చెప్పారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. రిజర్వేషన్లకు చరమగీతం పాడాలని బీజేపీ అనుకుంటున్నట్టు ప్రజలు గ్రహించారని ఖర్గే చెప్పారు. వారి ఉద్దేశం మంచిదైతే 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేసేవారని, వాటిలో సగం ఉద్యోగాలు పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు వచ్చేవని అన్నారు. 1982లో 'గాంధీ' సినిమా వచ్చేంత వరకూ ప్రపంచానికి గాంధీజీ గురించి తెలియదంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే మండిపడ్డారు. గుజరాత్‌కు చెందిన వ్యక్తికే గాంధీజీ గురించి తెలియదంటే ఏమి చెప్పాలి? జాతిపిత గాంధీజీ గురించి మీరు ఎందుకు ప్రమోట్ చేయలేదు అని ప్రశ్నించారు. మీరు గుజరాతీ కూడా. మీకు గౌరవం ఇస్తున్నాం. మీరు మాత్రం గాడ్సే ఐడియాలజీతో వెళ్లాలనుకుంటున్నారు అని ఖర్గే నిశిత విమర్శ చేశారు.

# ఎపి రాజధాని వ్యవహారం..!

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి. ఫలితాలతోనే రాజధాని కూడా స్పష్టం అవుతుంది. మొత్తానికి ఆంధ్రప్రదేశ్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. పాలనాకేంద్రం అన్నది లేకుండా ఐదేళ్ల కాలం గడిచి పోయింది. ఇక ఎపి రాజధాని ఏది అని అడిగితే చెప్పే పరిస్థితి లేదు. మూడు రాజధానులా అంటే అదీ లేదు. తలలేని మొండెంలా ఆంధ్రప్రదేశ్ గత కొన్నాళ్లుగా సాగుతోంది. రాజధాని అంటూ ఒకటి లేకుండా చేసి..అభివృద్ధి వికేంద్రీకరణ అంటూ సిఎ వైఎస్ జగన్ ప్రతిపాదనను మంత్రులు, అధికారులు తానా అంటే తందానాలాగా ప్రచారం చేపట్టారు. ఇప్పుడు ఎన్నికలు ముగిసాయి. నాలుగున ఫలితాలు రానున్నాయి. కొత్త ప్రభుత్వం వస్తేనే అమరావతి ముందుకు వస్తుంది. జగన్ మళ్లీ అధికారం చేపడితే విశాఖను రాజధాని చేయడం ఖాయం. విశాఖ రాజ ధాని అంటున్న సిఎం జగన్ ఎప్పుడు అటువైపు వెళతారన్నది ఫలితాలతో తేలనుంది. గత ఐదేళ్లలో రాజధాని, పాలనాకేంద్రాలపై ముఖ్య మంత్రులు తీసుకున్న నిర్ణయాలతో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియలేదు. ఓ వ్యూహం ప్రకారం ప్రజలకు, పాలకులకు మధ్య సంబధాలు లేకుండా చేశారు. ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తెలుసుకునే పరిస్థితి లేకుండా చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయింది. జగన్ అధికారంలోకి వస్తే ఇలాంటి దుర్గతి వస్తుందని ఎవరుకూడా ఊహించి ఉండరన్న ఆరోపణలుఉన్నాయి. అభివృద్ధి వికేంద్రీ కణ వేరు..రాజధాని వేరు అన్న స్పృహలో నేతలు లేరు. వారు చెప్పిందే వేదంలాగా..తాము పట్టిన కుందేటికి మూడు రాజధానులు అన్న చందంగా పాలన సాగించారు. చివరకు రాజధాని లేకుండా చేసుకున్నారు. అందుకే అక్కడ ఆందోళనలు కొనసాగాయి. అయినా ప్రభుత్వం చలించలేదు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి పాలనా వ్యవహారాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేసారు. జగన్ ఏం చేస్తున్నారో ఎవరికీ తెలి యదు. నిరంకుశ పాలన సాగుతున్నా ప్రశ్నించేవారు లేకుండా పోయారు. అలాగే ప్రశ్నించే వారిని ద్రోహులుగా చిత్రీకరించారు. ఇక అమరా వతికి సంబంధించి ...రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, మూడు రాజధానుల నిర్ణయాన్ని ఉపసంహరిం చాలని డిమాండ్ చేస్తూ నాలుగేళ్లుగా సాగిస్తున్న ఉద్యమంలో పోలీసుల కేసులు పెరిగాయి.మొత్తంగా ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఎవరన్నది తేలితే రాజధాని ఎక్కడ అన్నది స్పష్టత వస్తుంది. జగన్ అధికారం చేపడితే మళ్లీ విశాఖకు మారడం ఖాయం కానుంది. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అమరావతికి ప్రాణప్రతిష్ట కానుంది.

# ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

అర్ధరాత్రి దాటాక అరెస్టు చేశారు. జర్మనీ నుంచి బయలుదేరిన ఆయన బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన వెంటనే సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను భారీభద్రత మధ్య విచారణ నిమిత్తం సీఐడీ కార్యాయానికి తరలించారు. మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు అయిన ప్రజ్వల్ రేవణ్ణ.. ఎన్డీయే కూటమి తరఫున హాసన నుంచి ఎంపీగా బరిలోకి దిగారు. పలువురు మహిళలపై ఆయన లైంగిక దాడి చేసినట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఆయన గత ఏప్రిల్‌లో దేశం విడిచి పరారయ్యారు. ఇప్పటివరకు రేవణ్ణపై మూడు కేసులు నమోదు అయ్యాయి. ఆయన జాడ కోసం బెంగళూరు పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఆయనపై నాలుగుసార్లు నోటీసులు, ఒక అరెస్టు వారెంటు, బ్లూ కార్నర్, రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి. దౌత్య పాస్‌పోర్టు రద్దు చేసేందుకు కేంద్ర విదేశాంగ శాఖ చర్యలు చేపట్టింది. విచారణకు హాజరు కావాలని ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణ, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ బహిరంగానే కోరారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసుల విచారణకు సహకరిస్తానని, మే 31న 'సిట్' ముందు హాజరవుతానని ఇటీవల తొలిసారి వీడియో సందేశంలో రేవణ్ణ పేర్కొన్నారు. మరోవైపు బెంగళూరు కోర్టులో రేవణ్ణకు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు తిరస్కరించింది.



# మరువలేని మంచి మనిషి
# హీరో కృష్ణ
## వాడవాడలా కృష్ణ జన్మదిన వేడుకలు



**గవర్నర్‌పేట,మే 31 (ఆంధ్రపత్రిక):** తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మరువలేని మంచి మనిషి సూపర్ స్టార్ కృష్ణ అని ఆలిండియా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి అన్నారు. చలన చిత్ర పరిశ్రమలో ఎన్నో రికార్డులు, సంచలనాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సూపర్ స్టార్ కృష్ణ 81వ జయంతిని పురస్కరించుకుని ఫ్యాన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నగర వ్యాప్తంగా అనేక చోట్ల కేక్ కటింగ్లు, పేదలకు చీరలు పంపిణీ, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్లోని పార్కు ఆవరణలో ఏర్పాటు చేస్తున్న కృష్ణ కాంస్య విగ్రహం వద్ద కేక్ కటింగ్ జరిగింది. మున్సిపల్ శానిటరీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. పేదలకు పండ్లు, ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఫ్యాన్స్ సభ్యుడు పాపారావు ఆధ్వర్యంలో మరిపిళ్ళ చిట్టి పార్కులో జయంతి వేడుకలు నిర్వహించారు. పేదలకు చీరలు, మజ్జిగ పం పిణీ చేశారు. కృష్ణలంక పాత దుస్తుల సెంటర్లో పేదలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. బ్రహ్మం ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల సెంటర్లో మహిళలకు చీరలు పంపిణీ, ఆహారం పొట్లాలు అందజేశారు. సుధాస్వామి ఆధ్వర్యంలో సాయి ఆశ్రమంలో చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె. విజయ్, రాజు, సాయి, వెంకటేశ్వరరావు, టైలర్ తదితరులు పాల్గొన్నారు.





## ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా
# పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

- అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు

**విజయవాడ, మే 31 (ఆంధ్రపత్రిక):** ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు నేతృత్వంలో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ప్రతి దశలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా సాగేందుకు నోవా, నిమ్రా కళాశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని.. అధికారులు, సిబ్బందికి నాణ్యతతో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ (వీఎఫ్‌సీ), పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవోసీ), హోం ఓటింగ్, ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపును అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని.. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపులో వేగంతో పాటు కచ్చితత్వం అత్యంత ప్రధానమన్నారు. ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఒక్కో టేబుల్‌కు కేటాయించిన అధికారుల బృందం పూర్తిస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫారం-13సీ, ఫారం-13ఏ (డిక్లరేషన్), ఫారం-13బీ స్థాయుల్లో రిజెక్షన్ల నిబంధనలు, డిక్లరేషన్‌లో సీరియల్ నంబరు, ఓటరు సంతకం, అటెస్టర్ సంతకం తదితరాలతో పాటు బ్యాలెట్‌లో మార్కింగ్, ట్యాబ్యులేషన్ తదితరాలకు సంబంధించిన అంశాలను కలెక్టర్ డిల్లీరావు వివరించారు.

50 చొప్పున ఉన్న పోస్టల్ బ్యాలెట్ల కట్టలను వేరుచేసి సజావుగా లెక్కించే విధానాన్ని ప్రాక్టికల్‌గా వివరిం చారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర, ఎన్నికల సిబ్బంది నోడల్ అధికారి ఎం.రజనీ కుమారి, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.



రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా గవర్నర్‌కు 13 అంశాలపై వినతి పత్రం అందించిన రాష్ట్ర బీజేపీ నేతలు

ఆంధ్రపత్రిక ఫోటోలు: సిహెచ్.విజయభాస్కర్



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరిని ఘనంగా సన్మానించిన పార్టీ కార్యకర్తలు

# మహేశ్ ఎమోషనల్ పోస్ట్

తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన నటుడు కృష్ణ. అర్థ శతాబ్దం పాటు తన సత్తా చాటిన ఈ లెజెండరీ నటుడి జయంతి నేడు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు, అభిమానులు ఆయన్ని గుర్తుచేసుకుంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఇక తన తండ్రిని తలచుకుంటూ మహేశ్ బాబు ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్న. మిమ్మల్ని ప్రతి క్షణం మిస్ అవుతున్నాను. నా ప్రతి జ్ఞాపకంలోనూ మీరు ఎప్పటికీ జీవించే ఉంటారు' అంటూ కృష్ణ యంగ్ లుక్‌లో ఉన్నప్పటి ఫొటోను మహేశ్‌బాబు పంచుకున్నారు. హీరో సుధీర్ బాబు కూడా కృష్ణను తలచుకుంటూ పోస్ట్ పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే మామయ్య. మీ పక్కన కూర్చొని 'హరోం హర' చూడాలనుంది. నేను ఇలాంటి యాక్షన్ సినిమాలో నటించాలని మీరు ఎప్పుడూ ప్రోత్సహించేవారు. ఈ సినిమా మీకోసమే చేశాను. మీరు గర్వపడేలా చేస్తానని హామీ ఇస్తున్నాను' అని రాసుకొచ్చారు. అశోక్ గల్లా కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. ఈ సినిమాలోని రెండో పాటను కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. 'జై బోలో కృష్ణ' అంటూ సాగే ఈ పాటను ఆయనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.



# తమిళంలో బిజీగా కీర్తి సురేశ్

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి ప్రత్యేకంగా సినీ ప్రేమికులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నేను శైలజతో తెలుగు ఇండస్ట్రీలోకికి ఎంట్రీ ఇచ్చి అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ఇక గత ఏడాది దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగు సినిమాలకు బ్రేక్ ఇచ్చేసి వరుసగా తమిళంతో పాటు బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే హిందీ నటుడు వరుణ్ ధావన్‌తో ఒక సినిమా చేస్తున్న ఈ భామ తాజాగా 'రఘు తాతా' అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమాకు సుమన్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి రీసెంట్‌గా టీజర్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా మూ వీ విడుదల తేదీని అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు ప్రకటిం చింది. అయితే అదే రోజు తెలుగులో అల్లు అర్జున్ పుష్ప విడుదల కానుంది. దీంతో ఆగష్ట్ 15న రెండు పెద్ద సినిమాలు పోటి పడనున్న ట్లు తెలుస్తుంది. ఇక రఘు తాతా టీజర్ చూస్తే.. నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో క్యాడెట్ శిక్షణ పొందుతున్న కీర్తి సురేష్ పాత్రతో టీజర్ ప్రారంభమవుతుంది. అయితే ఔఅఆ మాస్టర్ హిందీలో శిక్షణ ఇస్తుండగా.. నాకు హిందీ రాదు తమిళంలో చెప్పండి సార్ అం టూ కీర్తి సురేష్ చెబుతుంది. దీంతో ఈ చిత్రం తమిళ ప్రజలపై హిందీని రుద్దడం చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తుంది. ఒక సన్నివేశంలో హిందీ పరీక్ష రాస్తేనే ఉద్యో గంలో ప్రమోషన్ వస్తుంది అంటే దానిని కీర్తి సురేష్ తిరస్కరించడం చూడవచ్చు. 'సలార్' తో సక్సెస్ అందుకున్న హోంబలే ఫిల్మ్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. ఎంఎస్ భాస్కర్, రవీం ద్ర విజయ్, దేవదర్శిని,రాజీవ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషి స్తున్నారు. షాన్ రోల్డన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.



# హరిహరవీరమల్లు షూటింగ్ పూర్తికి కసరత్తు

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైన్‌లో పెట్టాడని తెలిసిందే. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న సినిమాల్లో ఒకటి హరిహర వీరమల్లు .పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ఇప్పటికే నిర్మాత ఏఎం రత్నం చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇటీవలే ఏపీ ఎన్నికల షెడ్యూల్ ముగియడంతో పవన్ కల్యాణ్ ఎప్పుడెప్పుడు షూటింగ్ అప్‌డేట్ ఇస్తాడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు.తాజా టాక్ ప్రకారం ఈ మూవీ షూటింగ్‌ను జూన్ 15 నుంచి షురూ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ షూటింగ్ మొదలైన వారం తర్వాత చిత్రీకరణలో పాల్గొనబో తున్నాడని సమాచారం. ఈ సినిమాను సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్లు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన హరిహర వీరమల్లు పోస్టర్లు, గ్లింప్స్ వీడియోలు సినిమాపై అంచనాలు అమాంతం పెంచుతున్నాయి. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడ క్షన్స్ బ్యానర్‌పై ఏ దయాకర్ రావు నిర్మిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం హరిహరవీరమల్లు అండ్ టీంపై వచ్చే హై ఆక్టేన్ యాక్షన్ సీన్లను ఇప్పటికే రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరించారు. పవన్ కల్యాణ్ మరోవైపు ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో కూడా నటిస్తున్నాడు.





# దేవకీ నందన వాసుదేవ సాంగ్ రిలీజ్

టాలీవుడ్ యాక్టర్ అశోక్ గల్లా కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా దేవకీ నందన వాసుదేవ. గుణ 369 ఫేం అర్జున్ జంధ్యాల డైరెక్ట్ చేస్తున్నాడు. 2 ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీ నుంచి ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం సెకండ్ సింగిల్ జై బోలో కృష్ణ సాంగ్ లాంఛ్ చేశారు. రఘురామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో కంపోజిషన్‌లో స్వరాగ్ కీర్తన్ పాడాడు. ఈ మూవీకి జాంబిరెడ్డి ఫేం ప్రశాంత్ వర్మ కథనందిస్తున్నాడు. మేకర్స్ ఫస్ట్ యాక్షన్ వీడియోలో.. బురదలో జరిగే సన్నివేశంతో కట్ చేసిన ఫస్ట్ యాక్షన్ సీక్వెన్స్ ఇప్పటికే సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తూ.. సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. యూనిక్ కథాంశంతో తెరకెక్కుతన్న ఈ సినిమాలో అశోక్ గల్లా మాస్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు డైరెక్టర్ టీజర్‌తో క్లారిటీ ఇచ్చేశాడు. ఈ మూవీని నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ తెరకెక్కిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. నీ బిడ్డకు మరణగండం.. లేదా అతని చేతిలో మరొకరికి మరణం అనే డైలాగ్స్‌తో సాగే టీజర్ సినిమాపై ఇప్పటికే క్యూరియాసిటీ పెంచుతోంది.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత రచన పోటీ

- లక్ష రూపాయల పారితోషికం

**అమరావతి,మే 31 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయ్యింది. ఉమ్మడి రాజధాని గడువు కూడా జూన్ 2వ తేదీతో పూర్తయింది. అనంతపురం నుంచి శ్రీకాకుళం దాకా శోభిల్లుతున్న ఆంధ్రప్రదేశ్ భౌగోళిక,ఆంధ్ర సాహితీ, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే గీతం అవసరాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్ గుర్తించి, సరికొత్త రాష్ట్ర ప్రార్థనా గీతం రూపొందించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అందించాలని సంకల్పించినట్లు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడిరాష్ట్రంలో రాష్ట్రగీతంగా వున్న "మా తెలుగు తల్లికి మల్లెపూదండ " గీతాన్ని పూర్వ, అపూర్వ వైభవం గా గుర్తిస్తూ, గౌరవిస్తూనే, దాని స్థానంలో వర్తమాన ఆంధ్రప్రాంత వైభవ స్వాభిమాన గీతాన్ని రూపొందించాలని, అందుకోసం 5 నిమిషాల నిడివిగల గీత రచన పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.30 జూన్ 2024లోపున అభిలాష కలిగిన కవులు వారు వ్రాసిన గీతాన్ని కార్యదర్శి. ఆంధ్ర సారస్వత పరిషత్, అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రం, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ చిరునామాకు పంపవలసిందిగా కోరారు. జూలై 15వ తారీఖున ఎంపిక కాబడిన గీతాన్ని ప్రకటిస్తామని, ఒక ప్రముఖ సంగీత విద్వాంసులుచే గీతాన్ని స్వరబద్ధం చేయించి,ధ్వనిముద్రణ చేసి తదుపరి ఆ గీతాన్ని ముఖ్యమంత్రి వర్యులకు సమర్పిస్తామని తెలిపారు.ప్రభుత్వం కోరకపోయినా ఈ రాష్ట్ర గీతము యొక్క ఆవశ్యకతను గుర్తించి బాధ్యతగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ గీత ఎంపిక కమిటీని కూడా త్వరలో ప్రకటిస్తామని పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డా.కడిమిళ్ళ వరప్రసాద్ సహస్రావధాని, మేడికొండ శ్రీనివాస్ చౌదరి, కార్యదర్శి రెడ్డప్ప దవేజీ, సలహాదారు బాబ్జీశ్రీ, ముఖ్య సంచాలకులు కేశిరాజు రాంప్రసాద్‌లు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

# పల్నాడు ఎస్పీ మలికా గార్గ్ ఆవేదన వ్యక్తం

పల్నాడు పేరును చెడగొట్టొద్దు

ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ

ఈ గొడవల్లో సామాన్యులే ఇబ్బంది పడుతున్నారు

ఎస్పీ మలికా గార్గ్



**వినుకొండ, మే 31 (ఆంధ్రపత్రిక):** 'పల్నాడు పేరు చెడగొట్టారు.. ఇక్కడ కర్రలు, ఇనుపరాడ్లు పట్టుకొని రోడ్లపైన తిరుగుతుంటారని దేశమంతటా ప్రచారమైంది. మాచర్ల, నరసరావుపేట పేర్లు ఇండియా అంతటా మార్మోగుతున్నాయి' అని పల్నాడు ఎస్పీ మలికా గార్గ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని చెరిపేద్దాం. మనమంతా మంచి వాళ్లమని నిరూపిద్దాం అని పిలుపునిచ్చారు. ఇప్పుడీ సందేశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై చర్చ మొదలయ్యింది. ఎన్నికల సందర్భంగా జరిగిన హింసపై ఆమె ఘాటుగానే స్పందించారు. శాంతిభద్రతలపై పల్నాడు జిల్లా వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం స్థానిక పోలీసులు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. నా బ్యాచ్‌మేట్స్, కుటుంబసభ్యులు, మిత్రులు పల్నాడులో అంత ఫ్యాక్షన్ ఉందా అని అడుగుతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో పల్నాడు అత్యంత దారుణంగా ఉందని, పది రోజుల వ్యవధిలో 160 కేసులు నమోదవడం తాము కోరుకోని రికార్డు అని చెప్పారు. రెండో స్థానంలో ఉన్న జిల్లాలో 70 కేసులు నమోదయ్యాయంటే పల్నాడులో పరిస్థితి ఏ స్థాయిలో ఉందో గ్రహించాలన్నారు. ఆయా కేసుల్లో 1300 మందిని అరెస్టు చేశామని, వారిలో 400 మందిపై రౌడీషీట్లు తెరిచామని ఎస్పీ వెల్లడించారు. ఇక్కడ జైళ్లు పట్టక రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి పంపిస్తున్నట్లు వివరించారు. 'నాయకులు బాగానే ఉన్నారు. వారికి డబ్బు, తెలివి ఉన్నందున బెయిల్ తెచ్చుకొని బయట తిరుగుతున్నారు. ఈ గొడవల్లో సామాన్యులే ఇబ్బంది పడుతున్నారు' అని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇతరుల కోసం వీరి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈ జిల్లా ప్రజల్లో పౌరుషం ఎక్కువని, ఇక్కడివారు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని తనకు తెలుసన్నారు. ఎస్పీగా ఈ జిల్లాకు మంచిపేరు తెచ్చేందుకు వీరి అందరి సహకారం కోరుతున్నానన్నారు. పట్టణ సీఐ సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో అదనపు ఎస్పీ రాజశేఖర్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com